పర్యావరణం పరిరక్షిద్దాం



నూజివీడు మండలం నగర వనంలో మొక్క నాటి నీరు పోస్తున్న మంత్రి పార్థసారథి

నూజివీడు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): భావిత రాలకు చక్కని పర్యావరణాన్ని అందించాలని, పర్యావరణ పరిరక్షణ మన బాధ్యత అని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినం సందర్భంగా బత్తులవారిగూడెం నగరవనంలో మొక్కలను నాటారు. జిల్లాలో గురువారం ఒక్కరోజే పెద్ద ఎత్తున 4.5 లక్షల మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ప్రతీ ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి క్లాత్ బ్యాగ్‌లు వినియోగాన్ని పెంచాలన్నారు. పుట్టినరోజు, పెళ్లిరోజు వంటి సమయాలలో మొక్కలు నాటాలని సూచించారు. ప్రజలతో పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. అటవీ శాఖ అధికారి శుభమ్, సబ్ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన కలెక్టర్

ఏలూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): వనం మనం కార్యక్రమంలో భాగంగా పట్టిసీమలో గోదావరి ఒడ్డున కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎస్పీ కిశోర్, జేసీ పి.ధాత్రిరెడ్డి, ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మొక్కలు నాటారు. మొక్కలు నాటుదాం-పర్యావరణాన్ని కాపాడుదాం అంటూ ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు.



పట్టిసీమలో గోదావరి ఒడ్డున మొక్కలు నాటిన కలెక్టర్ వెట్రి సెల్వి, ఎమ్మెల్యే బాలరాజు



కేంద్ర వాణిజ్యకార్యదర్శి సునీల్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్

పామాయిల్ రైతుకు మద్దతు ధర ఇవ్వండి

కేంద్రానికి ఎంపీ మహేశ్ వినతి

ఏలూరు టూటౌన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి):పామాయిల్ గెలలకు కనీస మద్దతు ధర కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ కోరారు. ఢిల్లీలోని వాణిజ్య భవన్‌లో వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ భరత్వాల్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కస్టమ్స్ డ్యూటీ తగ్గింపు నోటిఫికేషన్‌ను వెనక్కి తీసుకోవాలన్నారు. క్రూడ్ ఎడిబుల్ ఆయిల్స్‌పై 50 శాతం కస్టమ్ డ్యూటీతో పామాయిల్ పంటకు కనీస మద్దతు ధర రూ.22 వేలు ఇవ్వడానికి అవకాశం ఉంటుందన్నారు. దిగుమతి సుంకం 27.5 శాతం నుంచి 16.5 శాతానికి తగ్గించడంతో కనీస మద్దతు ధర పడిపోయిందన్నారు. సానుకూలంగా స్పందించిన సునీల్‌భరత్వాల్ ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వానికి పంపుతానని హామీ ఇచ్చినట్లు ఎంపీ మహేశ్ తెలిపారు.

మైదానం నుంచి మరుభూమి వైపు



జిల్లాలో 40 ఏళ్ల క్రితం నక్సల్స్ సంచలనం.. పెదపాడు మండలం సత్యవోలు గ్రామానికి చెందిన విద్యార్థి తుపాకి వైపు మొగ్గుచూపారు. ఇంట్లో చెప్పకుండా విద్యాభ్యాసం చేస్తున్న విజయవాడ నుంచి నేరుగా మావోయిస్టు ఉద్యమం వైపు కదిలారు. ఈ విషయం తెలిసి స్వగ్రామంతో పాటు మిగతా గ్రామాలు కూడా వణికిపోయాయి. అప్పుడలా వెళ్లిన విద్యార్థి ఇప్పుడు నిర్జీవంగా కనిపించారు.

ఎన్‌కౌంటర్‌లో మావోయిస్ట్ సుధాకర్ మృతి

- సుధాకర్ స్వగ్రామం సత్యవోలు
- 40 ఏళ్ల క్రితం నక్సల్ ఉద్యమంలోకి
- మావోయిస్ట్ అగ్రనేతగా కీలక బాధ్యతలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

మావోయిస్టు ఉద్యమంలో అగ్రనేత ఎదిగిన తెంటు సుధాకర్ గురువారం బీజాపూర్ వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందారు. మూడు దశాబ్దాలుగా సుధాకర్ కోసం పోలీసు వేట కొనసాగుతోంది. ఒకప్పటి పీపుల్స్ వార్.. తర్వాత మావోయిస్టు పార్టీలో వ్యూహకర్తగా సుధాకర్ ఎది గారు. ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో మావోయిస్టు కార్యకలా పాలు ఉధృతం కావడంలో సుధాకర్ కీలకంగా వ్యవహరిం చారు. రెండు రాష్ట్రాల పోలీసు బలగాలకు కంట్లో నలుస య్యారు. మారుమూల గ్రామాల్లో గిరిజనుల మద్దతు కూడగట్టడంలో ఆయన పాత్ర మావోయిస్టు అగ్రనేతలను సైతం సంతృప్తి పరిచింది. ఆయనకున్న ఉద్యమ అనుభ వం, తీసుకున్న నిర్ణయాలు మావోయిస్టు క్యాడర్‌ను అటవీ ప్రాంతంలో విస్తరించడం ద్వారా ఆయన పదేళ్ల క్రితమే మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడయ్యారని చెబుతారు. ఆయనపై పోలీసులు పలు కేసులను నమోదు చేశారు. సాధ్యమైనంత మేర సుధాకర్ లొంగిపోయేలా ఆయన కుటుంబంపై ఒత్తిడి చేసినట్లు కూడా ప్రచారం సాగింది. సుధాకర్ మాత్రం అటవీప్రాంతంతోపాటు ఆయుధాన్ని వదులలేదు. నాలుగు దశాబ్దాలపాటు నక్సల్స్ ఉద్యమంలో సుదీర్ఘంగా ప్రయాణించారు. ఆయన ఆచూకీ కోసం పోలీస్ బలగాలు ఎప్పటికప్పుడు ప్రయత్నిస్తూనే వచ్చాయి. ఆయన తలకు రూ.50లక్షల రివార్డు ప్రకటించారు. తాజాగా ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జాతీయ అటవీ పార్కు వద్ద సుధాకర్ ను ఎన్‌కౌంటర్ చేశారు. మావోయిస్టు పార్టీకి వరుసగా ఎదురు దెబ్బలు తగులుతుండగా, ఇప్పుడు సుధాకర్ ఎన్‌కౌంటర్ సైతం ఆ కోవలోకే వస్తుంది.

మిగతా 8వ పేజీలో

నేడు డీఎస్సీ ప్రారంభం

ఏలూరు అర్బన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025 ఆన్‌లైన్ పరీక్షల నిర్వహణకు జిల్లాలో ఏర్పాట్లు పూర్తిచేసినట్టు కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే పరీక్షలు ఈ నెల 30వరకు స్థానిక సిద్ధార్థ క్వెస్ట్ సీబీఎస్‌ఈ స్కూలు, సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల, ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లలో రోజుకు రెండు సెషన్లలో జరుగుతాయన్నారు. జిల్లాలో 17,584 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. సందేహాలుంటే డీఈవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన కంట్రోల్‌రూమ్ ఫోన్ నంబర్లు 90307 23444, 95056 44555లలో సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. హాల్‌టిక్కెట్‌తోపాటు ఆధార్ లేదా ఏదైనా గుర్తింపుకార్డును తీసుకురావాలన్నారు. పరీక్ష ప్రారంభానికి గంటన్నర ముందుగా హాజరుకావాలన్నారు. పరీక్షకేంద్రాలకు అదనపు బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు.

లా సెట్.. ఎడ్ సెట్

ఏలూరు అర్బన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): న్యాయ విద్య, బీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు గురువారం ఆన్‌లైన్ పరీక్షలు జరిగాయి. లాసెట్‌కు స్థానిక సిద్ధార్థ క్వెస్ట్ కేంద్రంలో 147మంది, సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో 162, ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కేంద్రంలో 110మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 88మంది గైర్హాజరయ్యారు. ఎడ్‌సెట్‌కు సిద్ధార్థ క్వెస్ట్ కేంద్రానికి 145మంది, సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రానికి 166, ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కేంద్రానికి 88మంది హాజరయ్యారు. మొత్తం 101మంది గైర్హాజరయ్యారు.

ఐటీఐ ప్రవేశ కౌన్సెలింగ్

ఏలూరు అర్బన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటిఐల్లో ప్రవేశాలకు ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 202 దరఖాస్తులురాగా 100మంది విద్యార్థులు హాజరయ్యారు. 77మంది సీట్లను ఖరారు చేసుకున్నారని అడ్మిషన్ల కన్వీనర్, ప్రిన్సిపాల్ పి.రజిత తెలిపారు. కలెక్టరేట్ ఏవో నాంచారయ్య కౌన్సెలింగ్‌ను పరిశీలించారు.

పోలీస్ స్కూల్‌లో టీచర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు క్రైం, జూన్ 5(ఆంధ్రజ్యోతి):జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ సురేష్ చంద్ర బహుగుణ పోలీస్ ఇంగ్లీషు మీడియం స్కూలులో టీచర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్పీ కిశోర్ గురువారం తెలిపారు. ఈ నెల 10న ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు. పీఈటీ మేల్, ఫిమేల్, ఫిజికల్ సైన్స్-1, హిందీ పండిట్-1, తెలుగు పండిట్-1, కంప్యూటర్ టీచర్-1, ఎలిమెంటరీ టీచర్ -1 పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. బీఈడీ విద్యార్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



ఏలూరులో ఆందోళన వ్యక్తం చేస్తున్న కోకో రైతులు

కోకో గింజలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

ఏలూరు కార్పొరేషన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి):రైతుల నుంచి ప్రభుత్వమే కోకో గింజలు రూ.500 ధరకు కొనుగోలు చేయాలని ఏపీ కోకో రైతు సంఘం డిమాండ్ చేసింది. రైతులను ఇబ్బందులకు గురిచేస్తే తిరిగి ఉద్యమిస్తామని హెచ్చరించారు. స్థానిక అన్నేభవనంలో కోకో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొల్లు రామకృష్ణ అధ్యక్షతన గురువారం సమావేశాన్ని నిర్వహించారు. కోకో రైతుల సమస్యలసౌ చర్చించి పలు తీర్మానాలు చేశారు. ఏపీ రైతు సంఘం గౌరవ అధ్యక్షుడు, రిటైర్డ్ ఐపీఎస్ ఏబీ. వెంకటేశ్వరరావు, రైతు సంఘం రాష్ట్ర నాయకుడు వై.కేశవరావు మాట్లాడుతూ కోకో గింజల కొనుగోలుకు ప్రభుత్వ లక్ష్యం పూర్తయ్యిందని చెప్పడం తగదన్నారు. అంతర్జాతీయ మార్కెట్ ధర ఇవ్వకపోవడం వలన ఇప్పటికే కోకో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల వద్ద ఉన్న ప్రతీ కోకో గింజ కొనుగోలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనన్నారు. కోకో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్‌కు అనుసంధానమిస్తూ ఫార్ములా రూపొందించి కోకో గింజలను ధర నిర్ణయించే విధానం తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కోకో రైతు సంఘం నాయకులు సింహాద్రి గోపాలకృష్ణ, బోళ్ళ వెంకట సుబ్బారావు, గుడిబండి వీరారెడ్డి, పి.నరసింహారావు, ఈడ్పుగంటి శ్రీనివాస్, జి.పెదవీర్రాజు, పర్వతనేని గోపాలరావు, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, ఏలూరు జిల్లాతో సహా తూర్పు, పశ్చిమ, కోనసీమ జిల్లాల నుంచి వచ్చిన కోకో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జల్ జీవన్‌కు జవసత్వాలు



- వైసీపీ పాలనలో పూర్తి కాని పనులు
- పూర్తి చేస్తున్న కూటమి ప్రభుత్వం

కూటమి ప్రభుత్వ పాలనలో జలజీవన్ పథకానికి జవ సత్వాలు వచ్చాయి. ఇంటింటికీ మంచినీరు అందించడమే లక్ష్యంగా 2019లో జల జీవన్ ప్రారంభించినా గత ప్రభుత్వ హయాంలో పనులు మొక్కుబడిగా చేశారు. వైసీపీ పాలనలో చివరి ఏడాది పనులు ప్రారంభించినా చాలా చోట్ల అసంపూర్తిగా ఉన్నాయి. టీడీపీ ప్రభుత్వం రాగానే జలజీవన్ పనులపై దృష్టి సారించింది. ఇప్పటి వరకు ప్రారంభించని పనులను రద్దు చేసి టెండర్ విధానం ద్వారా చేపట్టాలని నిర్ణయించింది.

ఏలూరు సిటీ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జల్ జీవన్ మిషన్‌లో కేటాయించిన మొత్తం పనులు 1223. రూ.264.61 కోట్లు నిధులను మంజూరు చేశారు. ఇప్పటి వరకు 850 పనులు పూర్తికాగా 316 పనులు వివిధ దశల్లో ఉన్నాయి. గత ప్రభుత్వం హయాంలో ప్రారంభించని 57 పనులను రద్దు చేసి టెంబర్ విధానం ద్వారా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. నియోజకవర్గాల వారీగా ఏలూరులో 42, దెందులూరులో 240, ఉంగుటూరులో 61, చింతలపూడిలో 145, పోలవరంలో 424, కైకలూరులో 112, నూజివీడులో 132, గోపాలపురంలో 67 పనులను కేటాయించారు. వాటిలో ఏలూరులో 42, దెందులూరు 170, ఉంగుటూరు 51, చింతలపూడి 108, పోలవరం 238, కైకలూరు 90, నూజివీడు 84, గోపాలపురంలో 67 పనులు పూర్తయ్యా యి. దెందులూరులో 60, ఉంగుటూరులో 9, చింతల పూడిలో 32, పోలవరంలో 182, కైకలూరులో 18, నూజివీడులో 15 పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ప్రధానంగా జిల్లాలో 35 రక్షిత మంచినీటి పథకాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. వీటితో పాటు అవసరమైన ప్రాంతాల్లో బోర్‌వెల్స్ వాటికి మోటార్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రస్తుతం ఈ పనులు పూర్తి చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి

57 పనులకు టెండర్లు

గత ప్రభుత్వ హయాంలో అసలు ప్రారంభించని 57 పనులను రద్దు చేసి టెండర్ విధానం ద్వారా చేపట్టాలని నిర్ణయించారు. టెండర్ ప్రక్రియ పూర్తి కాగానే పనులను ప్రారంభించే అవకాశాలున్నాయి.

ఇంటింటికీ కుళాయి ఏర్పాటు లక్ష్యం

జల్‌జీవన్ మిషన్ పథకంలో ఇంటింటికీ కుళాయి నీరు ఇవ్వడమే లక్ష్యం. జిల్లాలో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గతంలో ప్రారంభించని పనులను టెండర్ విధానం ద్వారా చేపట్టాలని నిర్ణయించాం. అందరికీ మంచినీరు సరఫరా చేయడానికి చర్యలు తీసుకోవడం జరుగుతోంది. ఈ పథకం పూర్తయితే జిల్లాలో మంచినీటి సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారమయ్యే అవకాశం ఉంది.

– జి.త్రినాథ్‌బాబు, ఎస్ఈ, ఆర్‌డబ్ల్యుఎస్

ఆస్తి కోసం అన్నదమ్ములు కత్తులతో దాడి

ఏలూరు క్రైం, జూన్ 5(ఆంధ్రజ్యోతి):ఆస్తి పంపకాల్లో అన్నదమ్ముల మధ్య జరిగిన ఘర్షణలో కత్తులతో దాడికి దిగారు. ఐదుగురు గాయపడడంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేరారు. ఇరువైపుల వారి ఫిర్యాదుతో పోలీసులు కేసులు నమోదు చేశారు. ఏలూరు రూరల్ మండలం శ్రీపర్రు గురకలపేటకు చెందిన మండేల గంగరాజుకు అతని సోదరుడు మండేల రవీంద్రబాబుకు ఆస్థి తగాదాలున్నాయి. గురువారం ఇద్దరు ఒకరిపై ఒకరు కత్తులతో దాడి చేసుకున్నారు. గంగరాజుతోపాటు గంటసాల కుమారస్వామి, గంటసాల పెద్దిరాజు గాయపడగా మరోవైపు రవీంద్రబాబుతోపాటు మండల రామరాజు గాయాలపాలయ్యారు. ఈ రెండు వర్గాల వారి ఫిర్యాదుతో ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





దగ్ధమవుతున్న ఫర్నిచర్ షాపు



ఫర్నిచర్ షాపు దగ్ధం

- ఏలూరు సమీపంలో అగ్నిప్రమాదం
- రూ. కోటి ఆస్తి నష్టం
- ప్రమాదానికి కారణం షార్ట్ సర్క్యూట్.. వెల్డింగ్ నిప్పు రవ్వలా..?

ఏలూరు క్రైం, జూన్ 5(ఆంధ్రజ్యోతి):ఏలూరు సమీపంలోని ఫర్నిచర్ షాపు కమ్ గోడౌన్‌లో జరిగిన అగ్ని ప్రమాదం సంభవించింది. కోటి రూపాయలపైన ఆస్తి నష్టం సంభవించినట్లు ప్రాథమిక అంచనా. బీడీ కాలనీకి చెందిన మాడా బత్తుల వెంకటేష్ జంగారెడ్డిగూడెం రోడ్డులోని జేఎంజే స్కూలు సమీపంలో గణేష్ సోఫాస్ అండ్ ఫర్నిచర్ వర్క్స్ పేరుతో షాపు నిర్వహిస్తున్నారు. అక్కడే గోడౌన్ సోఫాసెట్ల తయారీ, మరమ్మతు లను చేస్తున్నారు. గురువారం సాయంత్రం అకస్మాత్తుగా అక్కడ దట్టమైన పొగ వ్యాపించి మంటలు చెలరేగాయి.

మిగతగా 8వ పేజీలో





మొగల్తూరు కాలువలో నిలిచిపోయిన గుర్రపు డెక్క, తూడు.

ఇవేం తవ్వకాలు ?

» కాలువ వెంబడి మట్టి పైకి ఎక్కేశారు..
తూడు, గుర్రపు డెక్క వదిలేశారు..

మొగల్తూరు కాలువ పనులపై విమర్శల వెల్లువ

మొగల్తూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పంట కాలువకు శివారు ప్రాంతమైన మొగల్తూరు ప్రధాన కాలువ తవ్వకాలపై స్థానికులు, రైతుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిడదవోలు నుంచి ప్రవహించే ప్రధాన కాలువ మొగల్తూరు వరకూ ప్రవహించి ఇక్కడ ఉప్పుటేరులో కలుస్తోంది. ఈ కాలువలో వచ్చే నీటిని మొగల్తూరు, కేపీపాలెంతో పాటు పలు గ్రామాల రక్షిత మంచినీటి ప్రాజెక్టులకు, వ్యవసాయ అవసరాలకు వినియోగిస్తున్నారు. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే తూడు, గుర్రపు డెక్క, జంతు, మానవ కళేబరాలు ఇక్కడ పేరుకుపోవడంతో నీరు దుర్వాసన రావడంతో కలుషితంగా కాలువ మారుతోంది. గత వైసీపీ పాలనలో ఈ కాలువ ప్రక్షాళన చేయకపోవడంతో మరింత సమస్య ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది వేసవిలో కాలువ తవ్వకం ప్రక్షాళన పనులు చేపట్టడంతో కాలువ తవ్వకం చేశారు. కేవలం అక్కడక్కడా కాలువకు ఇరుపక్కలా గట్ల వెంబడి మట్టి పైకి ఎక్కేశారు గాని లోతు తవ్వలేదని కాలువలో ఉన్న గుర్రపుడెక్క, తూడు యధావిధిగా ఉండిపోవడంతో తవ్వకం పనులతో ఉపయోగం ఎమిటని పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు. కాలువను చూస్తే ఎప్పుడో తవ్వారనే విధంగా ఉందని, కేవలం మట్టితీసి గట్టుమీద పెట్టినట్టుందని, తూడు కూడా ఎక్కేయని పరిస్థితి ఉంది. ఈ తవ్వకాల వల్ల కాలువ నీరు కలుషితం అయ్యే అవకాశం ఉందని అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి శివారు ప్రాంత రైతులు, ప్రజల అవసరాలను దృష్ట్యా కాలువ తవ్వకం పనులు క్వాలిటీ కంట్రోల్ అధికారులతో రైతుల సమక్షంలో తనిఖీలు చేసి పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలని రైతులు, స్థానికులు కోరుతున్నారు.

ఆకట్టుకున్న యోగాసన చిత్రాలు

గోడలపై సందేశాత్మకంగా చూడముచ్చటైన బొమ్మలు



ఏలూరు ఇండోర్ స్టేడియం ప్రహరీపై వేసిన యోగాసనాల చిత్రాలు




ఏలూరు రూరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఏలూరు నగరంలోని పలు ప్రధాన సెంటర్లలో ఒకప్పుడు గోడలన్నీ పోస్టర్లతో పెయింట్ రాలిపోయి అంద వికారంగా కనిపించేవి.. కానీ ఇప్పుడు జిగేల్ మనింపించే కలర్స్‌తో, సందేశమిచ్చే అందమైన బొమ్మలతో చూడముచ్చటగా దర్శనమిస్తున్నాయి. ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఆలోచనతో మున్సిపల్ కమిషనర్ పర్యవేక్షణలో గోడలన్నింటిపై సందేశాత్మక, మహాత్ముల చిత్రాలతో కూడిన వాల్ పెయింటింగ్స్ ఇప్పుడు నగర ప్రజల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఇప్పటికే కలెక్టర్ కార్యాలయం చుట్టూ గోడలపై అద్భుతమైన వాల్ పెయింటింగ్స్ వేయించారు. రైతులు, యువత, చిన్నారులు, మహిళలు, ఇలా అన్ని వర్గాల వారికి అవగాహన కల్పించేలా వేసిన సందేశాత్మక చిత్తరువులతో కొత్త అందాలను సంతరించుకుంది. తాజాగా ఈనెల 21న యోగాడే సందర్భంగా ఇండోర్ స్టేడియం చుట్టూ ఉన్న గోడలపై యోగ భంగిమలు పెయింటింగ్ వేస్తున్నారు. ఆర్టిస్టులుగా తమ ఉనికిని కోల్పోతున్న సమయంలో కలెక్టర్ తమకు జీవనోపాధి కల్పించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అందమైన బొమ్మలను గీయడంలో నిమగ్నమైన ఆర్టిస్టులు వేసిన పెయింటింగ్స్ చూపరులను కట్టిపడేస్తున్నాయి.

చింత తొలగేనా ?

» సుప్రీం కోర్టు ఆదేశాలతో నిలిచిన పనులు
» టీడీపీ ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చినా ముందుకు కదలని పనులు

పనులపై గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం



నూజివీడు నియోజకవర్గంలోని చింతలపూడి కాలువ

నూజివీడు, జూన్ 5(ఆంధ్రజ్యోతి):

చింతలపూడి ఎత్తిపోతల పథకం ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాలలోని మెట్ట ప్రాంతాలను సస్యశ్యామలం చేసే కాలువ. రూ.4,909 కోట్లు వ్యయంతో రెండు ఫేజ్‌లలో ఈ ఎత్తిపోతల పథకం పూర్తి కావాల్సి ఉంది. ఇప్పటికి 50 శాతం పనులు పూర్తయ్యాయి. పర్యావరణ అనుమతులు లేకుండా ఈ చింతలపూడి ఎత్తిపోతల పథకం చేపట్టారని పేర్కొంటూ ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే దివంగత వట్టి వసంత కుమార్ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు పిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన ట్రిబ్యునల్ 2022లో రాష్ట్ర ప్రభుత్వానికి రూ.72 కోట్లు జరిమానా విధించింది. దీనిపై అప్పటి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించగా మూడు నెలల్లో జరిమానా చెల్లించడం లేదా పర్యావరణ అనుమతులు పొందాలని ఆదేశించింది. జగన్ ప్రభుత్వం కోర్టు ఉత్తర్వులను అమలు చేయకుండా నిర్లక్ష్యం వహించడంతో సుప్రీంకోర్టు చింతలపూడి పనులను నిలిపివేయాలని ఉత్తర్వులు జారీ చేయడంతో చింతలపూడి పథకం పనులు అప్పటి నుంచి నిలిచిపోయాయి.

ప్రాధాన్యం ఇచ్చినా..!

2024లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రభుత్వం ప్రకటించిన ప్రధాన ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో చింతలపూడి ఎత్తిపోతల పథకం ఒకటి. ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తవుతోంది. ఇప్పటికే ఈ పథకానికి రూ.2,500 కోట్లు వరకు ప్రభుత్వం ఖర్చు చేసింది. సుప్రీం కోర్టు విధించిన రూ.72 కోట్లు అపరాధ రుసుము ప్రభుత్వానికి ఒక లెక్క కాదు. ఈ పథకం ఆలస్యమయ్యే కొద్ది రైతులకు జరిగే నష్టాన్ని పరిశీలిస్తే చెల్లించాల్సిన అపరాధ రుసుము చాలా చిన్నది. రెండు జిల్లాల్లోని సుమారు ఐదు లక్షల ఎకరాలకు సాగునీరు వందలాది గ్రామాలకు తాగునీరును ఈ పథకం ద్వారా గోదావరి జలాలను అందించవచ్చు.

చాట్రాయి మండలంలో వేంపాడు సాగర్ కాలువలోకి ఈ చింతలపూడి కాలువ అనుసంధానం అవుతుంది. వేంపాడు ద్వారానే కింద మండలాలైన ముసునూరు, ఏలూరు జిల్లాలోని వట్లూరు వరకు ఈ గోదావరి జలాలు అందుతాయి. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో చింతలపూడి కాలువ పనులు వేగవంతం కావడంతో చాట్రాయి మండలంలో వేంపాడు సాగర్ కాలువపై కిందకి నీరు వెళ్లడానికి కోసం నిర్మించిన కట్ అండ్ కవర్‌ను తొలగించడంతో ఇప్పుడు సాగర్ నీరు ఈ రెండు మండలాలకు అందని పరిస్థితి. ఇటు సాగర్ నీరు రాక అటు చింతలపూడి ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలు అందని పరిస్థితి నెలకొంది.

అడ్డంకులు ఇవే..

ఈ పథకానికి గ్రీన్ ట్రిబ్యునల్ విధించిన అపరాధ రుసుముతో పాటు ఫేజ్-1, ఫేజ్-2 లో రైతులకు నష్టపరిహారంగా చెల్లించాల్సింది కలిపి సుమారు రూ.175 కోట్లు ఉంటుంది. ఈ పథకంలో భాగంగా ఉన్న జల్లేరు రిజర్వాయర్ కెపాసిటీని 8 నుంచి 16 టీఎంసీలకు పెంచడంతో కొంత భూభాగం తెలంగాణ రాష్ట్రంలోకి వెళ్లడంతో ఇది రెండు రాష్ట్రాల సమస్యగా మారింది. ఈ రిజర్వాయర్‌లో కొంత భూభాగం అటవీశాఖకు చెంది నది కావడంతో దానిని డీనోటిపై చేయాల్సి ఉంది. ప్రభుత్వం శ్రద్ధ చూపితే త్వరితగతిన వీటిని పరిష్కరించవచ్చని ఆదిశగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మందగించిన 'తమ్మిలేరు' మరమ్మతులు

కాంట్రాక్టర్‌కు బిల్లులు విడుదల కాకపోవడంతో తమ్మిలేరు ప్రాజెక్టు మరమ్మతు పనులు మందగించాయి. జపాన్ ఇంటర్నేషనల్ కో-ఆపరేషన్ ఏజన్సీ (జైకా) నుంచి అనుమతులు రావాల్సి ఉండగా.. బిల్లులు చెల్లింపులో జాప్యం జరుగుతున్నట్టు తెలిసింది. దీంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. దశాబ్దాలుగా తమ్మిలేరు ప్రాజెక్టుకు మరమ్మతులు లేకపోవడంతో శిథిలావస్థకు చేరిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

» జైకా నుంచి అనుమతులు లేక బిల్లులు విడుదల జాప్యం
» టీడీపీ ప్రభుత్వంలో ఇప్పటికే 50 శాతం పనుల పూర్తి

కాంట్రాక్టర్‌కు రూ.6 కోట్లు బిల్లుల పెండింగ్

చాట్రాయి, జూన్ 5(ఆంధ్రజ్యోతి):

2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కృషితో జపాన్ బ్యాంకు (జైకా) నిధులు రూ.16 కోట్లు మంజూరయ్యాయి. టెండర్లు ప్రక్రియ పూర్తయ్యి కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టే సమయానికి 2019 ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రివర్స్ టెండరింగ్ పేరుతో టెండరును రద్దు చేసింది. 2021లో వైసీపీ సర్కార్ టెండర్లు పిలిచి కాంట్రాక్టర్‌ని ఖరారు చేసినా మూడేళ్లలో ఎడమ కాలువలో కేవలం రూ.1.64 కోట్ల విలువైన పనులే జరిగాయి. బిల్లులు విడుదల చేయకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నూజివీడు ఎమ్మెల్యే, గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి ప్రాజెక్టును సందర్శించి పనులు పునఃప్రారంభానికి చర్యలు తీసుకున్నారు. కొన్ని నెలల వ్యవధిలోనే కుడి, ఎడమ, మధ్య కాలువల పనులు సుమారు 50 శాతం జరగడం విశేషం. మే నెల మొదట్లో ఇరిగేషన్ అధికారులు బిల్లులను అప్‌లోడ్ చేశారు. నిధులు లేక బిల్లులు వెనక్కి రావడంతో కాంట్రాక్టర్ పనుల వేగాన్ని తగ్గించారు. కాంట్రాక్టర్‌కి సుమారు రూ.6 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్టు సమాచారం. ప్రభుత్వం బిల్లులు విడుదల చేసి తమ్మిలేరు ప్రాజెక్టు మరమ్మతులు పూర్తి చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



పోలవరం వద్ద రైట్ కెనాల్‌పై నిర్మించిన స్లూయిజ్ (ఫైల్)

త్వరలోనే బిల్లులు విడుదల

బిల్లుల అప్‌లోడ్ సమయంలో నిధులు లేకపోవడంతో బిల్లులు వెనక్కి వచ్చాయి. ఇప్పుడు ప్రభుత్వం బడ్జెట్ కేటాయించింది. కాంట్రాక్టర్‌కి రావాల్సిన బిల్లులు అప్‌లోడ్ చేస్తున్నాం. త్వరలోనే బిల్లులు విడుదల అవు తాయి. మిగతా పనులు త్వరలో చేపట్టి పూర్తి చేస్తాం.

- సీతారామ్, డీఈ
తమ్మిలేరు ప్రాజెక్టు



పనులు పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు (ఫైల్)
మేజర్-2పై నిర్మిస్తున్న స్లాబ్ కల్వర్టు (ఫైల్)



సినీ నటి అనన్య నాగెళ్లను ఆశీర్వదిస్తున్న అర్చకులు

మావుళ్లమ్మకు అనన్య పూజలు

భీమవరంటౌన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): భీమవరం పట్టణంలోని మావుళ్లమ్మ అమ్మవారిని సినీనటి అనన్య నాగెళ్ల గురువారం దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆమె ముందుగా అశ్వత్థ గణపతికి పూజలు చేయించుకున్నారు. తదుపరి అమ్మవారిని దర్శించుకోగా ఆలయ ప్రధాన అర్చకుడు మద్దిరాల మల్లికార్జున శర్మ ప్రత్యేక పూజలను నిర్వహించి ఆశీర్వచనాలు అందించారు. దేవస్థానం తరఫున ప్రసాదాన్ని, శేష వస్త్రాన్ని, అమ్మవారి చిత్రపటాన్ని అందించారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ ఉన్నారు. అనంతరం పంచారామ క్షేత్రమైన గునుపూడిలోని సోమేశ్వరస్వామిని, విద్యాగణపతిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వచనాలు అందించారు.

అరుదైన ఆరడుగుల కంద మొక్క

పాలకొల్లు అర్బన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): కంద మొక్క సుమారు 3, 4 అడుగుల వరకు పెరిగి చనిపోయిన తరువాత కంద దుంపను తవ్వి తీసుకుంటారు. చాలా అరుదుగా పెద్దగా పెరుగుతాయి. పోడూరు మండలం మట్టపర్రు గ్రామంలోని గోపరాజు సీతామహాలక్ష్మి నివాసంలో అరుదైన కంద మొక్క పెరిగింది. ఆరు అడుగులపైగా పెరిగిన కంద మొక్క చూపరులను ఆశ్చర్యపరుస్తోంది. గత డిసెంబరు నుంచి మొక్క ఎదుగుతోందని, ఇటీవల కురిసిన వర్షాలకు మరింత పెరిగిందని సీతామహాలక్ష్మి, ఆమె కోడలు అన్నపూర్ణ తెలిపారు.



కంద మొక్క వద్ద అత్త, కోడలు సీతామహాలక్ష్మి, అన్నపూర్ణ

వావ్.. పది కేజీల చేమ దుంప

టి.నరసాపురం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): సాధారణంగా చేమ దుంపల బరువు 100 గ్రాముల నుంచి ఒక కేజీ వరకు మాత్రమే ఉంటాయి. దానికి విరుద్ధంగా టి.నరసాపురం మండలం బొర్రంపాలెంలో మిడతా నాగమణి ఇంటి పెరటిలో ఏడాది క్రితం వేసిన చేమదుంప పెరిగి పెద్దదై సుమారు 10 కేజీల బరువు వరకు తయారై పలువరిని ఆశ్చర్యపరుస్తుంది. ఈ మొక్కకు పశువుల ఎరువు, నీరు, సమృద్ధిగా ఉండడంతో దుంప సైజు బాగా పెరిగినట్లు ఆమె తెలిపారు.



చేమదుంపను చూపుతున్న మిడతా నాగమణి

యోగాతో ఆరోగ్యం సొంతం : ఆరిమిల్లి

తణుకు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): నిత్య జీవితంలో యోగా చేయడం ద్వారా ఆరోగ్యం సొంతం చేసుకోవచ్చని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. గురువారం తణుకులోని బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో యోగాంధ్ర కార్యక్రమంలో ఉద్యోగులు, పట్టణ ప్రజలతో కలసి ఆయన యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో విశాఖలో ఐదు లక్షల మందితో ప్రధానమంత్రి మోదీ పాల్గొనే విధంగా సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారని వివరించారు. విశాఖ ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు ఐదు లక్షల మందితో యోగా నిర్వహించి గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో నమోదు చేసే విధంగా ప్రణాళిక చేస్తున్నట్లు పేర్కొన్నారు.



యోగాసనాలు వేస్తున్న ఆరిమిల్లి

పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యతగా స్వీకరించాలి

ఏలూరు క్రైం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలని, ప్లాస్టిక్ వసువులు, క్యారీ బ్యాగుల వాడకానికి స్వస్తి పలికి, గుడ్డ సంచులను వాడాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి చైర్మన్, ఏడో అదనపు జిల్లా జడ్జి వై.శ్రీనివాసరావు పిలుపు నిచ్చారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వనం-మనం కార్యక్రమంలో భాగంగా ర్యాలీని నిర్వహించి, జిల్లా కోర్టు ప్రాంగణంలో మొక్కలను నాటి, ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడు విధిగా కనీసం రెండు మొక్కలు నాటి, వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రతి ఇంటి ఆవరణలో, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో విధిగా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసి భూగర్భజలాలను వృద్ధికి సహకరించాలని సూచించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ మాట్లాడుతూ ప్రకృతిలోని సమతుల్య స్థితిని కాపాడాలని పర్యావరణ పరిరక్షణ అనే అంశాలపై ప్రజలకు న్యాయ విజ్ఞాన సదస్సులతో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎనిమిదో అదనపు జిల్లా జడ్జి ఐ. శ్రీనివాసమూర్తి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీవీ కృష్ణసాయితేజ, ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి మహ్మద్ అబుతాలిబ్‌షేక్, తదితరులు పాల్గొన్నారు.



కోర్టు ఆవరణలో మొక్క నాటుతున్న ఇన్‌చార్జి జిల్లా జడ్జి శ్రీనివాసరావు

• పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఉమ్మడి జిల్లాల న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. గురువారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవనంలో పలు పరిశ్రమల ప్రతినిధులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కాలుష్య నివారణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కె.వెంకటేశ్వరరావు, పరిశ్రమల ప్రతినిధులు, జిల్లా కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



శ్రీవారి ఆలయ ప్రాంగణంలో వివాహం, ఉపనయనం దృశ్యాలు

వెంకన్న ఆలయంలో రద్దీ

» జోరుగా వివాహాలు, ఉపనయనాలు
» ఆలయ పరిసరాలు భక్తులు, పెళ్లి జనాలతో కిటకిట

ద్వారకాతిరుమల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు, పెళ్లిజనాలతో కిటకిటలాడింది. ఉపనయనాలు, వివాహాలు చేసుకునేందుకు ఈ జ్యేష్ఠ మాసంలో మంచి ముహూర్తం కావడంతో గురువారం శ్రీవారిక్షేత్రం వేదికైంది. సాధా రణంగా ఉపయనాలకు మంచిముహూర్తం కుదరదు. అయితే ఈ మాసంలో ఇది మంచిది కావడంతో, ఉపనయనాలు, వివాహాలు అనివేటి మండపప్రాంతంలోను, ప్రైవేటు కల్యాణమండపాల్లో శాస్త్రోక్తంగా జరిగాయి. అన్ని క్రియలను జరిపించి శుభముహూర్త సమయంలో వటువులకు యజ్ఞోపవీత ధారణ జరిపారు. స్థానిక పాత కల్యాణమండప ప్రాంతంలోనూ ప్రైవేటు ఫంక్షన్ హాల్స్‌లోను వివాహాలు అధికంగా జరిగాయి. అన్ని కార్యక్రమాలు పూర్తయిన తర్వాత వటువులు, పెళ్లిజనాలు శ్రీవారు, అమ్మవార్లను దర్శించుకున్నారు.

నేత్రపర్వం.. నవకలశ స్నపన

» ముగిసిన కుంకుళ్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు

ద్వారకాతిరుమల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): త్రయాహ్నిక దీక్షతో జరుగుతున్న క్షేత్రదేవత కుంకుళ్లమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలు గురువారం జరిగిన విశేష కార్యక్రమాలతో ముగిశాయి. శ్రీవారి ప్రధాన ఆలయానికి ఉపాలయమైన ఈ ఆలయంలో మూడు రోజులుగా జరుగు తున్న ఉత్సవాల్లో భాగంగా ఆలయాన్ని మరింత శోభాయమానంగా అలంకరించారు. అనంతరం అమ్మవారిని విశేష పుష్పమాలలతో అలంకరించారు. తొలుత ఉదయం మూలవరులకు, ఉత్సవమూర్తులకు నవకలశస్నపన. శ్రీచక్రార్చన, సప్తశతి పారాయణ. మహాపూర్ణాహుతి హోమం శాస్త్రోక్తంగా జరిగాయి. అర్చకులు, పండితులు ఘనంగా క్రతువును జరిపారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక అలంకారాల్లో ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు.



కుంకుళ్లమ్మ మూలవరులకు నవకలశ స్నపన నిర్వహిస్తున్న అర్చకుడు

కనువిందు చేస్తున్న మే, రాఖీ పుష్పాలు

ఏలూరు రూరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ప్రతి ఏటా మే నెలలో ప్రకృతి ప్రేమికులను అలరించే మే పుష్పం ఆలస్యంగా వికసించి కనువిందు చేస్తున్నాయి. దుగ్గిరాలకు చెందిన ఆలీఖాన్ మహమ్మద్ ఇంటి పెరట్లో ఒకేసారి మే పుష్పాలు, రాఖీ పుష్పాలు వికసించి చూపరులను ఆకర్షిస్తున్నాయి. ఏడాదిలో మే నెలలో మాత్రమే వికసించే ఈ పుష్పాలు జూన్ మొదటి వారంలో వికసించడంతో ఆసక్తిగా తిలకిస్తున్నారు. ఫుట్‌బాల్ లిల్లీ లేదా బ్లడ్ లిల్లీ అనే అరుదైన జాతికి చెందిన ఈ పువ్వును భారతదేశంలో మే పుష్పం అని పిలుస్తారు. అన్నాచెల్లల మధ్య మమతానురాగాల ప్రతీక రక్షాబంధన్ (రాఖీ పండుగ), రాఖీ పండుగ రోజున మార్కెట్‌లలో దొరికే రాఖీలను సోదరీమణులు వారి సోదరులకు కడతారు. అయితే ప్రకృతి ఒడిలో చెట్లకు విరబూసే రాఖీలు చాలా తక్కువ మందికే తెలుసు. కొన్నిచోట్ల మాత్రమే కనిపించే ఈ పూలు అచ్చం రాఖీని పోలి ఉండడంతో రాఖీ పూలు అని పిలుస్తారు. ఈపూల వెనుక పెద్ద కథే ఉంది. ఈ పూలను కౌరవులు - పాండవుల పూలు అని కూడా పిలుస్తారు. ఈ పూల కింది భాగంలో సన్నటి కేసరాల్లాంటి నూరు రేఖలు ఉంటాయి. వీటిని కౌరవులు అంటారు. మధ్యభాగంలో ఐదు పెద్ద రేఖలు ఉంటాయి. వీటిని పాండవులు అంటారు. అందుకే వీటిని కౌరవుల - పాండవుల పుష్పాలు అని పిలుస్తారు. ఆ పైభాగంలో ఉండే మూడు రేఖలను భీష్ముడు, ద్రోణుడు, కుంభాచార్యుడని చెబుతారు. ఈ పూలు సాయంత్రం వేళల్లో సువాసనలు వెదజల్లుతాయి.





వికసించిన రాఖీ పుష్పాలు
విరబూసిన మే పుష్పాలు

పర్యావరణ పరిరక్షణ ఒక యజ్ఞం


మొక్క నాటి నీరు పోస్తున్న మంత్రి శ్రీనివాస వర్మ

భీమవరం టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ఒక్కరోజు జరుపుకునే వేడుక కాదని, ఇది ప్రతి ఒక్కరి జీవితంలో భాగంగా నిత్య కృత్యంగా కొనసాగాల్సిన యజ్ఞమని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆయన ఢిల్లీలోని తన నివాసంలో అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చదనం పెంపొందించటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కేంద్ర మంత్రిగా ఎన్నో బాధ్యతలున్నా పర్యావరణ పరిరక్షణకు తాను అధిక ప్రాధాన్యత ఇస్తానన్నారు.



ఆంధ్రా షుగర్స్ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న దృశ్యం

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడండి

తణుకు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఆంధ్రా షుగర్స్ జనరల్ మేనేజర్ ఎ.సాంబశివరావు అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆంధ్రా షుగర్స్ ప్రాంగణంలో కాలుష్య నియంత్రణ మండలి సూచనలు మేరకు వెయ్యికి పైగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. పర్యావరణ సమతుల్యం దెబ్బతినకుండా కాపాడుకోవాలని, ప్లాస్టిక్ వస్తువులు వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని కోరారు. అనంతరం పలువురు ఉద్యోగులు మొక్కలు నాటారు. సంస్థ చీఫ్ కెమిస్ట్ బి.శ్రీనివాసరావు, జి.బాబూరావు, జి.ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

● సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో సంఘ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర్ చౌదరి, కార్యదర్శి, సభ్యుల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. సమర యోధులు పార్కులో వావిలాల సరళాదేవి, మహిళలు మొక్కలు నాటారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి


మొక్కలు నాటిన జడ్పీ ఛైర్మన్ పద్మశ్రీ

పెనుమంట్ర, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జడ్పీ ఛైర్మన్ గంటా పద్మశ్రీ ప్రసాద రావు పిలుపునిచ్చారు. గురువారం ఆలమూరు పంచాయతీ వద్ద ప్రపంచ పర్యావరణ దినోత్స వాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటి వద్ద మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నా రు. సర్పంచ్ వెంకట రమణ, ఎంపీటీసీ ఆశాలత, నీటి సంఘం డైరెక్టర్ తేతలి వెంకట రామారెడ్డి, బీసీ సెల్ నాయకులు కడలి ఏడుకొండలు, గురి పర మేశ్వరరావు, ఎంపీడీవో ప్రభాకర్ రావు, గ్రామ కార్యదర్శి సుధారాణి పాల్గొన్నారు.

నేడు ఎస్జీటీలకు పదోన్నతి కౌన్సెలింగ్

ఏలూరు అర్బన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్, పీఎస్‌హెచ్ఎం పదోన్నతులకు అర్హులైన 675 మంది ఉపాధ్యాయుల వివరాలను డీఈవో ఏలూరు వెబ్ సైట్‌లో గురువారం పొందుపర్చారు. సుమారు 225 పోస్టులకు 1:3 నిష్పత్తిన అర్హులైన టీచర్లను గుర్తించగా, వీరంతా తమ సర్వీస్ రిజిస్టర్, విద్యార్హతల ధ్రువ పత్రాలతో సర్టిఫికెట్ వెరిఫికేషన్, పదోన్నతి కౌన్సెలింగ్‌కు ఈ నెల 6న ఏలూరు జడ్పీ మీటింగ్ హాలుకు హాజరు కావాల్సి ఉంటుంది. ఉదయం 9 నుంచి సర్టిఫికెట్ల వెరిఫికేషన్, ఆ వెంటనే పదోన్నతి కౌన్సెలింగ్ జరుగుతాయి.

15న పదోన్నతి కౌన్సెలింగ్ !

ఆలోగానే రెగ్యులర్ ఏఎన్ఎంలకు బదిలీలు?

రెగ్యులర్, గ్రేడ్-3 ఏఎన్ఎంల సమస్యకు పరిష్కారం

ఏలూరు అర్బన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): సాధారణ బదిలీల కోసం రెగ్యులర్ ఏఎన్ఎంలు, ఎంపీహెచ్ఏ(ఫిమేల్) పదోన్నతుల కోసం గ్రేడ్-3 సచివాలయ ఏఎన్ఎంల వాగ్వాదం, డిమాండ్లతో బుధవారం ఉదయం నుంచి గురువారం తెల్లవారుజాము 3.30 గంటల వరకు ఏలూరు డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద సుదీర్ఘంగా కొనసాగిన ఆందోళనకు తెరపడింది. ఇరు వర్గాలతో వేర్వేరుగా జిల్లా అధికారులు జరిపిన బుజ్జగింపు చర్యల అనంతరం ఎవరికీ నష్టం వాటిల్లకుండా ఓ ఫార్ములాను ప్రతిపాదించగా ఇరువైపులా ఆమోదం లభించినట్టు డీఎంహెచ్‌వో కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. ఆ ప్రకారం ఈ నెల 15న పదోన్నతులకు కౌన్సెలింగ్ చేపట్టడానికి నిర్ణయించినట్టు ఉమ్మడి జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల వైద్యాధికారులకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ గురువారం రాత్రి సమాచారం పంపింది. అప్పటి వరకు గ్రేడ్-3 సచివాలయ ఏఎన్ఎంలకు ఎటువంటి సెలవులు ఇవ్వవద్దని ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకనుగుణంగానే ఎవరికీ నష్టం రాకుండా చర్యలు తీసుకుంటామని కార్యాలయ అధికారులు హామీ ఇవ్వడంతో ఇరువర్గాలు శాంతించినట్టు చెబుతున్నారు. ఆ ప్రకారం తొలుత సాధారణ బదిలీల కౌన్సెలింగ్‌ను పూర్తిచేసే అవకాశం ఉంది. ఆ వెంటనే 15న పదోన్నతి కౌన్సెలింగ్‌ను చేపడతారు. దీనివల్ల ఇరువర్గాల డిమాండ్లను నెరవేర్చినట్టవుతుందని డీఎంహెచ్‌వో కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. మరోవైపు జిల్లాలో బదిలీలు, పదోన్నతుల రగడపై వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు గురువారం ఆరా తీశారు. బుధవారం జరిగిన రాద్ధాంతానికి ఓ అధికారి పరిపాలనలో పట్టుకోల్పోవడమే కారణమని వ్యాఖ్యానించినట్టు సమాచారం. మొత్తం మీద డీఎంహెచ్‌వో కార్యాలయం ప్రతిపాదించిన ఫార్ములాకు ఇరు వర్గాలు ఆమోదం తెలపడంతో జటిల సమస్యకు శాంతియుత పరిష్కారం లభించినట్టు చెబుతున్నారు. కాగా 15న పదోన్నతుల కౌన్సెలింగ్‌పై స్పష్టత రాగా, బదిలీల కౌన్సెలింగ్ ఎప్పుడు చేపడతారో గురువారం రాత్రి వరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఎటువంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు.

ముదినేపల్లి పంచాయతీపై కైకలూరు సర్పంచ్ ఫిర్యాదు

సమగ్ర విచారణకు డీపీవో అనూరాధ ఆదేశాలు జారీ

ముదినేపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి పంచాయతీలో గత నాలుగేళ్ళలో జరిగిన ఆర్థిక అవకతవకలు, నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కైకలూరు సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి చేసిన ఫిర్యాదుపై సమగ్ర విచారణ నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి కె. అనూరాధ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 2న ఏలూరులో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో ముదినేపల్లి పంచాయతీలో 2021 ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మే 31 వరకూ జరిగిన ఆర్థిక అవకతవకలు, పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలని అందుకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు కైకలూరు సర్పంచ్ నవరత్నకుమారి ఫిర్యాదు చేశారని డీపీవో తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదుపై విచారణ నిర్వహించి 15 రోజుల్లోగా సమగ్ర నివేదికను అందజేయాలని గురువారం ఏలూరు డివిజనల్ పంచాయతీ అధికారి, ముదినేపల్లి డిప్యూటీ ఎంపీడీవో (ఈవోపీఆర్డీ)లను ఆదేశించారు. పంచాయతీల్లో అవకతవకలు, నిధులు దుర్వినియోగంపై ఆ పంచాయతీ సభ్యులు గానీ, గ్రామస్థులు గానీ ఫిర్యాదు చేయడం, విచారణ కోరడం ఆనవాయితీ. అందుకు విరుద్ధంగా ఫిర్యాదుల పర్వంలో కొత్త ఆనవాయితీ మొదలైంది. ముదినేపల్లి పంచాయతీలో అవకతవకలు జరిగాయంటూ కైకలూరు సర్పంచ్ ఫిర్యాదు చేయడం కొత్త ఆనవాయితీకి నాంది పలికినట్లు అయింది.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

● ఉమ్మడి పశ్చిమలో 13 రోడ్లకు మోక్షం ● ఆరేళ్ల తర్వాత ఆర్‌అండ్‌బీకి నాబార్డు నిధులు

ఏలూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి) : పంచాయతీరాజ్ నుంచి రోడ్లు భవనాల శాఖకు బదలాయించిన గ్రామాల్లో పలు ప్రాంతాల మీదుగా వెళ్లే మెయిన్ రోడ్లకు ఆరేళ్ల తర్వాత మోక్షం లభిస్తోంది. ప్రభుత్వం కొలువు దీరాక కోట్లాది రూపాయలతో అత్యంత ప్రాధాన్యతగా భారీ గుంతలను పూడ్చించింది. అనంతరం గుంతలను పూడ్చటానికి వీల్లేని వాటికి రోడ్లుగా అభివృద్ధి చేయడానికి నిధులు భారీగానే ఏడాదిలో విడుదల చేసింది. తాజాగా ఆరేళ్ల క్రితం నుంచి రాని నాబార్డు నిధులిచ్చి ఉమ్మడి ఆర్‌అండ్‌బీ సర్కిల్ పరిధిలో 13రోడ్లకు మోక్షం కల్పిస్తోంది. నిధులు మంజూరు చేయడంతో అధికారులు ఎట్టి పరిస్థితుల్లో ఈ నెలాఖరులోగా టెండర్లు పూర్తి చేయాలని నిర్ణయించారు. వేగంగా ఆగస్టు నాటికి అన్ని రోడ్లు గ్రామీణ ప్రాంతాల్లో పూర్తి చేసి రాకపోకలకు అనువుగా చేయడానికి దృఢ సంకల్పంతో ఉన్నారు. ప్రధానంగా నాబార్డు ఆర్ఐడీఎఫ్ ట్రంచ్ 30 కింద ఈ పనులను మంజూరు చేశారు. వైసీపీ హయాంలో ఈ నిధులు మచ్చుకైనా రాలేదని, ప్రభుత్వం ఉన్నత స్థాయిలో గతంలో పంపిన ప్రతిపాదనలకు కార్యరూపం దాల్చే దిశగా అడుగులు వేసిందని అధికారులు చెబుతున్నారు. గత ఆరేళ్లలో ఒక్కపని కూడా ఈ పథకం చేయ లేదని, అధికారులు, ఇటు కాంట్రాక్టర్లు పేర్కొంటున్నారు.



రోడ్లకు నిధులు ఇలా..

లింగపాలెం నుంచి పుప్పాలవారిగూడెం వయా సింగగూడెం వరకు 4 కిలోమీటర్ల మేర రూ.కోటి 60 లక్షలు రోడ్లకు బీటీ వేయనున్నారు. మనుకొల్లు నుంచి కోటపాడు వయా చీపురుగూడెం మీదుగా 6.5 కిలోమీటర్లకు కోటి రూపాయలు, సీజీ రోడ్డు నుంచి కోనాల వయా జెట్లపాలెం - దర్శిపర్రు, రాచర్ల రోడ్డు వరకు 5.080 కిలోమీటర్లకు రూ.కోటి 50లక్షలు, రమణక్కపేట ఆర్ అండ్‌బీ నుంచి బచ్చవరప్పాడు, జనార్దనపురం మీదగా 3.28 కిలోమీటర్లు 2 కోట్లు, దిర్శుమర్రు నుంచి కోమటి తిప్ప నార్త్ - కోలమర్రు కొండేపాడు 8.170 కిలోమీటర్లకు రూ.2కోట్ల 50లక్షలు, పూలపల్లి - ఆగర్తిపాలెం 8.6 కిలోమీటర్లకు రూ.కోటి 70 లక్షలు, కవిటం - ఓడూరు నుంచి యలమంచిలి- కాజా రోడ్డు 4 కిలో మీటర్లుకు రూ.కోటి 70 లక్షలు, నర్సాపురం - మొగల్తూరు, రుస్తుంబాద - కొప్పర్రుల్లో 6.5 కిలోమీటర్లకు రూ.2 కోట్ల 50 లక్షలు, ఉర్ధాళ్లపాలెం నుంచి దువ్వ, మార్టేరు-వడలి రోడ్డుకు 9.3 కిలోమీటర్లకు రూ.3 కోట్లు, ఎర్రచెరువు-పి.వేమవరం రోడ్డుకు 3.6 కిలోమీటర్లకు రూ.కోటి 26 లక్షలు, వడ్లూరు - తీపర్రు రోడ్డు 8.5 కిలోమీటర్లకు రూ.3 కోట్ల 24లక్షలు, తేతలి - మునిపల్లి రోడ్డుకు 4 కిలోమీటర్లకు 60లక్షలు, పశివేదల-ఆరికిరేవులు రోడ్డు 4.2 కిలోమీటర్లకు రూ. 2కోట్ల30 లక్షలు నిధులు మంజూరయ్యాయి. వీటిని వర్షాకాలంలోపే చేయడానికి ప్రయత్నాలు ముమ్మరం చేశామని జిల్లా రోడ్డు భవనాల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ పి.భరతరత్నం తెలిపారు.

రెచ్చిపోతున్న కాల్‌మనీ గ్యాంగ్..

● ఏలూరు నగరంలో శ్రుతిమించుతున్న ఆగడాలు ● కిడ్నాప్‌లు, దాడులతో వేధింపులు
● భరించలేక ఇటీవల ఒకరి ఆత్మహత్య ● చర్యలు తీసుకోవాలంటూ బాధితుల వేడుకోలు


ఆస్పత్రిలో ఉన్న ఆంజనేయులు, బాధితుడి భార్యతో మాట్లాడుతున్న వడ్డీ వ్యాపారులు(ఫైల్)

ఏలూరు క్రైం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పేదల ఆర్థిక అవసరాలను ఆసరా చేసుకుని కొంత మంది వడ్డీ వ్యాపారులు అనధికారంగా వ్యాపారలు చేస్తూ అధిక వడ్డీలను వసూలు చేస్తూ కాల్‌మనీ కింగ్‌లుగా చెలామణి అవుతున్నారు.వీరికి కొంతమంది నేరచరిత్ర కలిగిన వారు రికవరీ ఏజెంట్లుగా వ్యవహరించడంతో వడ్డీకి సొమ్ములు తీసుకున్న బాధితులు ఆ వడ్డీలు కట్టలేక, అసలు తీర్చలేక ఆర్థికంగా కొట్టుమిట్టాడుతున్నారు. చివరకు ఆత్మహత్యలు కూడా చేసుకుంటున్నారు. మరికొంతమంది బాధితులపై కాల్‌మనీ గ్యాంగ్‌లు, రికవరీ ఏజెంట్లు దాడులకు తెగబడుతున్నారు. కొంత మంది బాధితులు ఫిర్యాదు చేస్తుండగా, మరి కొంతమంది బాధితులు ఫిర్యాదులు చేయలేక భయభ్రాంతులకు గురై మిన్నకుండిపోతున్నారు. ఏలూరు నగరంలో ఇటీవల వడ్డీ వ్యాపారుల జోరు పెరిగిపోయింది. కొంత మంది టెండర్ వ్యాపారం అంటూ సాయంత్రం అయ్యిందంటే రోడ్డు పక్కన చిరు వ్యాపారాలు చేసే వారి వద్దకు వచ్చి వడ్డీలు వసూలు చేసుకుంటున్నారు. రాత్రి 11 గంటల వరకూ ఇలాంటి వడ్డీ వ్యాపారులు నగరంలో వందలాది మంది అన్ని వ్యాపార సముదాయాల్లో కనిపిస్తూనే ఉంటున్నారు. అప్పు తీసుకున్న వారి వద్ద ఒక చిన్న పుస్తకం రోజుకు ఇంత సొమ్ము చెల్లించాలంటూ ఆ పుస్తకంలో చెల్లించాల్సిన సొమ్మును నమోదు చేస్తున్నారు. లక్ష రూపాయలు అప్పు తీసుకోవాలంటే లక్షకు 17 వేలు తీసుకుని, మరి కొంత మంది 20 వేలు తగ్గించి మిగిలిన సొమ్ములను ఇస్తారు. రోజుకు వెయ్యి రూపాయలు వంతున వంద రోజుల్లో ఆ సొమ్ములను చెల్లించాలి.అదనంగా రోజులు పెరిగాయంటే ఎస్టీడీ వడ్డీలంటూ వసూలు చేస్తున్నారు. ఇదొక ముఠా పనికాగా మరికొన్ని ముఠాలు మాత్రం నూటికి పది రూపాయలు వంతున వడ్డీలకు ఇస్తున్నారు. ఏరోజు వడ్డీ ఆరోజే చెల్లించాలి. లేదా వారాంతపు వడ్డీ చెల్లించాలి. అసలు అలాగే ఉంటుంది. వడ్డీ మాత్రం వారం వారం చెల్లించాల్సిందే. ఇలాంటి ముఠాలకు నగరంలో నేరచరిత్ర కల్గిన కొంత మంది రికవరీ ఏజెంట్లుగా మారి దందాలు నిర్వహిస్తున్నారు. రాజమహేంద్రవరం, అనపర్తి ప్రాంతాల నుంచి కొంత మంది ఇక్కడకు వచ్చి వడ్డీ వ్యాపారాలు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఇటీవల కాల్‌మనీ వ్యాపారుల ఆగడాలు ఏలూరు నగరంలో మితిమీరిపోవడంతో కొద్ది నెలల క్రితమే ఐదుగురిని ఏలూరు త్రి టౌన్ పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపించారు. అయితే కొద్ది కాలం ఈ కాల్‌మనీ వ్యాపారులు గప్‌చిప్ మంటూ నిశ్శబ్దంగా ఉన్నా ఇటీవల రెచ్చిపోతున్నారు. ఇటీవల ఏలూరు రూరల్ స్టేషన్ పరిధిలోని ఒక ఆటో డ్రైవర్ తన కుటుంబ అవసరాలు నిమిత్తం అప్పులు చేశాడు. అప్పులకు వడ్డీలు చెల్లిస్తున్నప్పటికీ కూడా వడ్డీకి సొమ్ములిచ్చిన వారు వేధింపులకు గురి చేయడంతో చివరకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు తంగెళ్ళమూడి ప్రాంతానికి జొన్నకూటి ఆంజనేయులు రాజమహేంద్రవరానికి చెందిన ఒక వ్యాపారి వద్ద 20 వేల రూపాయలు తీసుకున్నాడు. నూటికి పది రూపాయలు వంతున వారం వారం వడ్డీ చెల్లిస్తున్నాడు. అయితే ఇటీవల పనులు లేకపోవడంతో వడ్డీ చెల్లించకపోవడంతో ఏకంగా ఇళ్ళకు ఆ వ్యాపారితో పాటు మరికొంత మంది రికవరీ గ్యాంగ్ వెళ్లి హెచ్చరించారు. ఆంజనేయులు ఎక్కడ కనిపించినా నడిరోడ్డుపై కాలర్ పట్టుకుని కింద పడేసి తంతామని వార్నింగ్ ఇచ్చారు.అన్న ప్రకారమే ఆ గ్యాంగ్ ఈ నెల 2వ తేదీ రాత్రి ఆంజనేయులును ఇంటి నుంచి తీసుకుపోయి అతని వద్ద ఉన్న మోటారుసైకిల్, సెల్‌ఫోన్ తీసుకుని చిత్రహింసలకు గురిచేసి గాయపరిచారు. గాయాలపాలైన అతను కుటుంబ సభ్యుల సహకారంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేరాడు. ఏలూరు టూటౌన్ పోలీసులు వడ్డీ వ్యాపారిపై, అతనితో పాటు కలిసి ఆంజనేయులపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే నగరంలో ఇంకా కొంత మంది వడ్డీ వ్యాపారులు సాయంత్రం అయితే రోడ్ల మీద వ్యాపారుల వద్దకు వెళ్లి బెదిరింపులకు పాల్పడుతున్నట్లు బాధితులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు వ్యాపారులపై నిఘా పెట్టి అనధికారికంగా వడ్డీ వ్యాపారం చేస్తూ నిత్యం ప్రజలకు భయభ్రాంతులకు గురి చేస్తున్న వీరిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పలువురు బాధితులు కోరుతున్నారు.

జేఎన్వీలో ప్రవేశానికి

దరఖాస్తుల ఆహ్వానం

పెదవేగి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయం(జేఎన్వీ)లో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పెదవేగి జేఎన్వీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధీర్ కుమార్ చెప్పారు. 2026- 27 విద్యా సంవత్సరానికి సంబంధించి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆయన తెలిపారు. అభ్యర్థులు 2025- 26 విద్యా సంవత్సరంలో ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తరగతి చదువుతూ ఉండాలన్నారు. 2014 మే 1వ తేదీ నుంచి 2016 జూలై 31వ తేదీ మధ్య జన్మించినవారు దరఖాస్తు చేయడానికి అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తు చేయడానికి వచ్చే నెల 29వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. అభ్యర్థులు నవోదయ విద్యాలయ సమితి వెబ్‌సైట్ హెచ్‌టీటీపీఎస్://ఎన్‌వీవోడీఏవైఏ.జీవోవి.ఐఎన్, హెచ్‌టీటీపీఎస్://సీబీఎస్‌ఈఐటీఈఎమ్.జీవోవీ.ఐఎన్/ఎన్‌వీఎస్ నుంచి వివరాలు తెలుసుకోవచ్చని, డిసెంబరు 13వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

నిర్వాసితుల భూసేకరణకు క్షేత్ర పరిశీలన


పొలాలు పరిశీలిస్తున్న చింతూరు ఐటీడీఏ అధికారులు

జీలుగుమిల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి చింతూరు డివిజన్ కూనవరం మండలం కొండ్రాజుపేట నిర్వాసితులకు భూసేకరణ చేసేందుకు సంబంధిత శాఖ అధికారులు జీలుగుమిల్లి మండలంలో ఎర్రవరం సమీపంలోని పొలాల్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ క్రమంలో గురువారం చింతూరు ఐటీడీఏ పీవో, అపూర్వ భరత్, ఎస్‌డీసీలు సరళ వందనం, బలరామకృష్ణ, ఆధ్వర్యంలో కొండ్రాజుపేట గ్రామస్థులకు భూమికి భూమి, ఇళ్ల స్థలాలు ఇక్కడ ఏర్పాటు చేసేందుకు ఆయా భూములు అనుకూలంగా ఉన్నాయో లేదో తెలుసుకుని ఆయా గ్రామ గిరిజనులతో కలిసి పరిశీలించారు. అనంతరం సంబంధిత నివేదికను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నామన్నారు. జీలుగుమిల్లి, కూనవరం తహసీల్దార్లు ఉదయ్ భాస్కర్, వెంకటేశ్వరావు, వీఆర్వో తులసీ, సర్వేయర్ అబ్రార్ ఉన్నారు.

క్రైం సమాచారం

వేర్వేరుచోట్ల ఎనిమిది మంది మృతి

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు చోట్ల గురువారం మొత్తం ఎనిమిది మంది మృతి చెందారు. కారును ఢీకొట్టిన వ్యాన్ ఘటనలో ఒకరు, బైక్‌ను ఢీకొట్టిన కారు ఘటనలో మరొకరు, కలుపు మందు తాగి ఒకరు మృతి చెందగా.. పాము కాటుతో ఓ మహిళ మృతి చెందింది. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ ఇద్దరు మృతి చెందారు. రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో స్నానానికి దిగిన పెంటపాడు యువకుడు మృతి చెందగా, నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో అత్తిలి మండలం మంచిలి గ్రామానికి చెందిన యువకుడు మృతి చెందాడు.

కలుపు మందు తాగి ఒకరి మృతి

టి.నరసాపురం, జూన్ 5(ఆంధ్రజ్యోతి) : కలుపు మందు తాగి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన టి.నరసాపురం మండలంలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. బండివారిగూడెం గ్రామానికి చెందిన పెనుమత్స శ్రీనివాసరాజు(52)కు వివాహమైంది. ఒక కుమారుడు ఉన్నాడు. 20ఏళ్ల క్రితం భార్యభర్తలు మనస్పర్థలతో విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి అతడు తల్లితో కలిసి ఉంటున్నాడు. ఒంటరితనం భరించలేక మద్యానికి బానిసై చనిపోవాలనే ఉద్దేశంతో గ్రామశివారులో వున్న కోళ్లఫాం వద్ద కలుపుమందు తాగాడు. సమాచారం తెలుసుకున్న మృతుడి అన్నయ్యలు కారులో జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతడు మృతి చెందాడు. మృతుడి తల్లి శకుంతల ఫిర్యాదుతో హెడ్‌కానిస్టేబుల్ ఎం.రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాము కాటుకు మహిళ..

ఏలూరు క్రైం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పాముకాటు వేయడంతో ఒక మహిళ తీవ్ర అస్వస్థతకు గురై ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ద్వారకాతిరుమల మండలం పి.కన్నాపురానికి చెందిన పెరుమాళ్ళ సీత(34)కు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గురువారం ఉదయం ఆమెను పాము కాటు వేయడంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

గోదావరిలో స్నానానికి దిగి యువకుడి మృతి

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో స్నానానికి దిగిన యువకుడు ప్రమాదవశాత్తూ మునిగిపోయి నీళ్ల తాగి మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. తాడేపల్లిగూడెం సమీపంలో పెంటపాడు గ్రామానికి చెందిన పాలిక అభిరామ్(23) స్నేహితులను కలిసేందుకు రాజమహేంద్రవరం వచ్చాడు. స్థానిక శ్రీరాంనగర్‌లో ఉన్న స్నేహితుల వద్దకు వచ్చి అక్కడి నుంచి స్నేహితులతో కలిసి గోదావరి స్నానానికి పుష్కరాల రేవుకు గురువారం సాయంత్రం వెళ్లారు. స్నానం చేస్తుండగా అభిరామ్ ప్రమాదవశాత్తూ మునిగిపోయాడు. అతడిని బయటకు తీసి ఆసుపత్రికి తరలించే సరికి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న త్రీటౌన్ పోలీసులు అభిరామ్ తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒంటరితనం భరించలేక యువకుడు..

నిడదవోలు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) :ఒంటరితనం భరించలేక ఒక యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. అత్తిలి మండలం మంచిలి గ్రామానికి చెందిన ఏజర్ల విక్రమ్(19) తల్లి కువైట్‌లో ఉండగా..తండ్రి వైజాగ్‌లో ఉంటూ చేపల చెరువు వద్ద పనిచేస్తున్నాడు. మంచిలిలో విక్రమ్ ఒక్కడే ఉంటున్నాడు. ఇదిలా ఉండగా బుధవారం నిడదవోలు మండలం సమిశ్రగూడెం గ్రామంలో ఉన్న మేనత్త ఇంటికి వచ్చాడు. చాలా సేపు అక్కడ గడిపాడు. అనంతరం మేనత్తతో ఒంటరితనం భరించలేకపోతున్న ట్టు చెప్పాడు. మేనత్త ఏదో సర్దిచెప్పింది. అయినా పట్టించుకోలేదు. కాసే పటికే వెంట తెచ్చుకున్న పురుగు మందు తాగేశాడు. గమనించిన బంధువులు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ గురువారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సమిశ్రగూడెం ఎస్ఐ బాలాజీ తెలిపారు.

కారును ఢీకొట్టిన వ్యాన్.. ఒకరి మృతి


ముత్యాలపల్లి వంతెనపై ఢీకొన్న కారు, వ్యాన్

మొగల్తూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ముత్యాలపల్లి వంతెనపై కారు ఐషర్ వ్యాన్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో కారు నడుపుతున్న విద్యాశాఖకు చెందిన సైట్ ఇంజనీర్ కర్రి వెంకటరెడ్డి(45)మృతి చెందారు. ఎస్ఐ జి.వాసు తెలిపిన వివరాలివి.. కృష్ణా జిల్లా బంటుమిల్లిలో విద్యాశాఖలో సైట్ ఇంజనీర్‌గా విధులు నిర్వర్తిస్తున్న వెంకటరెడ్డి విధి నిర్వహణలో భాగంగా గురువారం వేకువజామున రాజమహేంద్రవరానికి కారులో బయలుదేరారు. ముత్యాలపల్లి వంతెనపైకి చేరుకున్న సమయంలో మొగల్తూరు నుంచి ఐస్ లోడుతో బంటుమిల్లి వెళుతున్న వ్యాన్ ఎదురుగా వచ్చి కారును ఢీకొనడంతో కారు ముందుభాగం నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయాలపాలైన వెంకట రెడ్డిని అత్యవసర వాహనంలో నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందాడు. వ్యాన్ ముందు భాగంగా కూడా దెబ్బతింది. వంతెన రెయిలింగ్ ధ్వంసం చేస్తూ కాల్వ వైపునకు వెళ్లి నిలబడింది. అప్రమత్తమైన వ్యాన్ డ్రైవర్ వాహనం నుంచి కిందకు దూకడంతో ప్రాణాలు దక్కాయి. ఐస్ ప్యాకింగ్ బాయ్‌గా పనిచేస్తున్న కోమటితిప్పకు చెందిన శీలం కుమార్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఈ ఘటనపై మృతుడి భార్య మేఘన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు.. ఒకరి మృతి

» మరొకరికి తీవ్ర గాయాలు


పండు మృతదేహం

నరసాపురం రూరల్, జూన్ 5: పట్టణంలోని రుస్తుంబాద టాయ్‌సిటీ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలివి.. పాలకొల్లుకు చెందిన ఇద్దరు యువకులు బైక్‌పై సీతారాంపురం వెళుతుండగా.. సీతారాంపురం నుంచి నరసాపురం వస్తున్న కారు వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయాలు కాగా అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం తణుకు తరలిస్తుండగా మార్గమధ్యలో కె.పండు(25) అనే యువకుడు మృతి చెందాడు. మరోవైపు ప్రమాదం జరిగిన వెంటనే ప్రభుత్వ విప్ నాయకర్ ఘటన ప్రదేశానికి వెళ్లి ప్రమాదానికి గల కారణాలను స్థానికుల నుంచి ఆరా తీశారు. హైవేపై ముఖ్య కూడళ్లలో వాహనాల వేగాన్ని తగ్గించే విధంగా బారికేడ్లు ఏర్పాటు చేయాలని పోలీసుల్ని ఆదేశించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు..

పెంటపాడు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వృద్ధుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలివి.. పెంటపాడు గ్రామానికి చెందిన నున్నా పుల్లారావు(70) గత నెల 31న పింఛన్ తీసుకునే నిమిత్తం తాడేపల్లిగూడెం మండలం ఉప్పరగూడెం గ్రామానికి తన బంధువు పాలంగి చంటితో కలసి బైక్‌పై వెళ్తున్నాడు. పెంటపాడు ఎస్‌టీవీఎస్ పాఠశాల వద్ద వీరు వెళ్తున్న మోటారుసైకిల్‌ను కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన పుల్లారావును చికిత్స నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని జరిగిన ఘటనపై కేసు నమోదు చేశామని ఎస్ఐ స్వామి తెలిపారు.

చికిత్స పొందుతూ మరొకరు..

ఉండి, జూన్ 5(ఆంధ్రజ్యోతి) : లారీ ఢీకొట్టిన ప్రమాద ఘటనలో తీవ్రంగా గాయపడిన మోటారుసైక్లిస్టు సప్పా సుబ్రహ్మణ్యం(42) చికిత్స పొందుతూ మృతిచెందాడు. గురువారం రాత్రి పోలీసులు తెలిపిన వివరాలివి.. ఉండి మండలం రామాపురం వద్ద ఈనెల మూడో తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన అతడిని భీమవరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించినట్టు పోలీసులు తెలిపారు.


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నయీం అస్మి

రౌడీ షీటర్‌పై పీడీ యాక్టు

భీమవరంటౌన్/భీమవరం క్రైం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో తరచూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ చట్టాన్ని ఉల్లంఘిస్తున్న పట్టణానికి చెందిన కొత్తపల్లి విక్టర్ బాబును గూండాగా పరిగణించి పీడీ యాక్టు అమలు చేశామని, అతడిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించామని పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయిం అస్మి తెలిపారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో గురువారం విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. నిందితుడు కొత్తపల్లి విక్టర్‌బాబుపై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటు తెరిచారన్నారు. అతడికి ప్రతీరోజు కౌన్సెలింగ్ ఇస్తూ మంచి ప్రవర్తనతో జీవించాలని హెచ్చరించేవారని, అయితే పోలీసు ఆదేశాలను దిక్కరిస్తూ వన్‌టౌన్, టూటౌన్ పోలీస్ స్టేషన్‌ల పరిధితో పాటు, ఉండి, కాళ్ల పోలీస్ స్టేషన్ల పరిధుల్లో తరచూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నారన్నారు. ఈమేరకు అతడిపై పీడీ యాక్టు ప్రయోగించి ముందస్తు నేర నియంత్రణ చర్యల్లో భాగంగా నిర్బంధించి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించామని వివరించారు.

గంజాయి తరలిస్తున్న యువకుడి అరెస్టు

ఏలూరుక్రైం, జూన్5(ఆంధ్రజ్యోతి): గంజాయి తీసుకువెళ్తున్న ఒక యువకుడిని ఏలూరు టూటౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ మధు వెంకటరాజా అరెస్టు చేశారు. ఏలూరు గూడ్స్‌షెడ్డు రోడ్డులో టూటౌన్ సీఐ, ఎస్ఐ, తమ సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. దెందులూరులోని శ్రీసైనిక పేటకు చెందిన తియ్యాల సాయిదుర్గ అనే యువకుడు మోటారు సైకిల్‌పై వస్తుండగా పోలీసులు ఆపారు. అతడు పారిపోవడానికి ప్రయత్నించగా అదుపులోకి తీసుకుని బైక్‌ను తనిఖీ చేయగా ఐదు కేజీల గంజాయి ఉంది. అతడిని అరెస్టు చేసి గురువారం కోర్టుకు హాజరుపరిచారు. రిమాండ్ విధించడంతో జిల్లా జైలుకు తరలించారు.

ప్లాస్టిక్ అనర్థాలపై కళాజాత

ఏలూరు రూరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి) : సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల జరిగే అనర్థాలపై ఉదయం కళాజాత కార్యక్రమం జీవన విధానాన్ని మెరుగుపరుచుకునేలా అవలంబించాల్సిన అంశాలపై కళాజాతా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం పరిసరాల పరిశుభ్రత పారిశుధ్య పరిరక్షణ తీసుకోవలసిన అనేక జాగ్రత్తలపై కళాకారుల బృందం ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో స్థానిక కాలుష్య నియంత్రణ మండలి సిబ్బంది, కళాజాత బృందం సభ్యులు ఎం.ప్రశాంత్ కుమార్, ఎం.తిరుపతి కుమార్ పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

భీమడోలు : గుండుగొలను శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. ఈ మేరకు నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు బహుమతులు అందజేశారు.


బహుమతులు అందుకున్న చిన్నారులు


ఏలూరులో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే చంటి, మేయర్ నూర్జహాన్, గన్ని, కుక్కునూరులో మొక్కనాటుతున్న అధికారులు, దెందులూరులో మొక్కలు అందజేస్తున్న చింతమనేని, వెలగలపల్లిలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే సొంగా

మొక్కలు నాటి సంరక్షించండి

జిల్లా వ్యాప్తంగా ప్రజలకు పిలుపునిచ్చిన ప్రజాప్రతినిధులు, అధికారులు

ఏలూరు, మే జూన్ 5(ఆంధ్రజ్యోతి):ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు కార్యాలయంలో డీసీసీబీ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, సీఈవో పి.సింహాచలం, డీజీఎం సత్యనారాయణలు గురువారం మొక్కలు నాటారు. తొలుత గన్ని కార్యాలయ ఆవరణలోనే సర్ ఆర్థర్ కాటన్, స్వామి వివేకానంద, మన్నే సత్యనారాయణ మూర్తి (బాబు), జవ్వాది లక్ష్మయ్య నాయుడుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీసీసీబీ కార్యాలయ ప్రధాన సమావేశ మందిరంలో సీఈవో, డీజీఎంలతో సమావేశమయ్యారు. డీజీఎంలు మాధవ మూర్తి, కిరణ్మయిలు పాల్గొన్నారు. కలెక్టరేట్ ఆవరణ లో డీఆర్వో వి.విశ్వేశ్వరరావు మొక్కలు నాటారు. కార్య క్రమంలో కార్యాలయ పరిపాలనాధికారి నాంచారయ్య, సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

● ఏలూరు క్రైం: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏలూరు ప్రభుత్వాస్పత్రి ఆవరణలో ఉన్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎం.శశిధర్, రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు ఆలపాటి నాగేశ్వరరావులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.బెన్నీ, కమిటీ ఎ.నాగేశ్వరరావు, సభ్యులు ఎం.చంద్రశేఖర్, ఎం.అజయ్‌బాబు, వర ప్రసాద్, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.దీనాకుమారి, ఎన్.శ్రీలక్ష్మి, టి.రామారావు, ఎ.నిర్మల, ఎం.పద్మజ పాల్గొన్నారు.

● దెందులూరు:స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో హెచ్‌ఎం వడ్లపట్ల విజయ్ కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జి గారపాటి కొండయ్య చౌదరి, ఇప్పిలి వెంకటేశ్వరరావులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం సర్పంచ్ తోట యేసమ్మ, ఎంపీటీసీ శేషారత్నం, టీడీపీ నాయకులు సంపంగి వేణుగోపాల తిలక్‌లతో కలిసి చింతమనేని గ్రామ సభలో మాట్లాడారు. దెందులూరు ఎంపీడీవో శ్రీదేవి, తహసీల్దార్ సుమతితో కలిసి మొక్కలను గ్రామస్థులకు అందజేశారు. జాతీయ రహదారి పక్కన టీడీపీ నాయకులు కమ్మ శివరామకృష్ణ, జహీక్ జహీర్ అహ్మద్ కసుకూర్తి రామకృష్ణ, బగాతి చిన్నారావులతో కలిసి ఎమ్మెల్యే చింతమనేని మొక్కలు నాటారు. ఈ తాగునీటి సరఫరా విభాగం డివిజనల్ అధికారి డి.రామారావు, ఆర్‌డబ్ల్యూఎస్ మండల అధికారి చింతమనేని వర్మ, గోదావరి డీసీ చైర్మన్ వెలమాటి రాంబాబు పాల్గొన్నారు. జోగన్నపాలెంలో సహకార సంఘం బ్యాంకు అధ్యక్షులు పసుమర్తి మదుబాబు, సర్పంచ్ పసుమర్తి రాజేశ్వరి, మాజీ సర్పంచ్ ప్రభాకర్ పాల్గొన్నారు.


గుంటుపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న ఘంటా మురళీ

● భీమడోలు: మండలంలోని పోలసానపల్లిలో సర్పంచ్ షేక్ హసీనా రహీమాబేగం, కూటమి సభ్యులు మొక్కలు నాటి పర్యావరణ రక్షణకై ప్రతిజ్ఞ చేశారు. అనంతమ్మ, రామకృష్ణ, ధనలక్ష్మి, గంజి సుబ్బారావు, శ్రీనుబాబు, సత్యనారాయణ పాల్గొన్నారు. భీమడోలు విశాల సహకార సంఘ సొసైటీ ఆవరణలో డీసీసీబీ చైర్మన్ గన్ని వీరాంజనేయులు మొక్కలు నాటారు. పర్యావరణ విశిష్టతను వివరించారు. ఏఎంసీ చైర్మన్ శేషపు శేషగిరి పాల్గొన్నారు.

● పెదవేగి:ముండూరు, రాట్నాలకుంట గ్రామాల్లో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మొక్కలు నాటారు. మండల వ్యాప్తంగా ఎంపీడీవో,ఎంఈవో, తహసీల్దారు. పోలీస్ స్టేషన్, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, పంచాయతీ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో ముమ్మరంగా మొక్కలు నాటారు.

● ఉంగుటూరు: నారాయణపురంలో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. నియోజకవర్గ వ్యాప్తంగా 60వేల మొక్కలను నాటేందుకు శ్రీకారం చుట్టినట్టు ఎమ్మెల్యే తెలిపారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీ రాణి, సర్పంచ్ దిడ్ల అలకనంద, నీటి సంఘం అధ్యక్షులు గోలి ప్రసాద్, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ చింతల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ కారేటి జ్యోతి, అయ్యప్ప, జనసేన పార్టీ మండలాధ్యక్షులు వంది రాంబాబు, ఎంపీడీవో జి.రాజ్ మనోజ్ పాల్గొన్నారు.

● ఏలూరు : జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ కార్యాలయ పరిధిలోని న్యూ అశోక్‌నగర్‌లో సూపరింటెండెంట్ ఆనాల ఆవులయ్య, అసిస్టెంట్ సూపరింటెండెంట్ జి.పాండురంగారావులు సిబ్బందితో కలిసి డివైడర్ల, రోడ్లకు ఇరువైపులా గురువారం మొక్కలు నాటారు. ఏలూరు, భీమడోలు, చింతలపూడి, పోలవరం, జంగారెడ్డిగూడెం, కైకలూరు, నూజివీడు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 800 మొక్కలను నాటినట్టు తెలిపారు.

● ఏలూరు టూటౌన్: నగర పరిధిలోని పోణంగి డంపింగ్ యార్డులో మేయర్ నూర్జహాన్‌తో కలిసి ఎమ్మెల్యే చంటి మొక్కలు నాటారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పిలుపు మేరకు రాష్ట్రంలో కోటి మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలన్నారు. మేయర్ నూర్జహాన్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు చాలా అవసరమన్నారు.కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు, ఇడా చైర్మన్ శివప్రసాద్, ఏఎంసీ చైర్మన్ ఎం.పార్థసారథి, కార్పొరేటర్ అనూష, అడిషనల్ కమిషనర్ చంద్రయ్య, డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి, సురేంద్రబాబు పాల్గొన్నారు. తంగెళ్లమూడి రాణినగర్‌లో డిప్యూటీ మేయర్ వందనాల దుర్గాభవాని మొక్కలు నాటారు. టీడీపీ నేత వందనాల శ్రీనివాస్, సచివాలయ సెక్రటరీ రాజేశ్ పాల్గొన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో పెరికే ఫౌండేషన్ చైర్మన్ పీ.వరప్రసాదరావు ఫిన్నీజోన్స్, పెరికే దీనాగ్లాడీ పాల్గొని మొక్కలు నాటారు.

● కుక్కునూరు: అటవీ శాఖ ఆధ్వర్యంలో మారేడుబాక నర్సరీ నుంచి మొక్కలు తీసుకొచ్చి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ నాటారు. తహసీల్దార్ రమేశ్ బాబు, ఎంపీడీవో నరసింహరావు, ఎంపీపీ గీతావాణి, టీడీపీ మండలాధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు, జనసేన పార్టీ మండలాధ్యక్షులు యుగంధర్, గోపాల కృష్ణ, వెంకన్నబాబు, వీఆర్వో కేసరి పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల: శ్రీవారి శేషాచలంపై ఆలయ ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈఈ డీవీ భాస్కర్, ఏఈవో శ్రీనివాస్, డీఈ టి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

● చింతలపూడి: వెలగలపల్లి ఫారెస్ట్‌లో ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ మొక్కలు నాటారు. జిల్లా అటవీ అభివృద్ధి కార్పొరేషన్ డిస్ట్రిక్ట్ మేనేజర్ భవిత, అటవీ శాఖాధికారులు పాల్గొన్నారు. మునిసిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో మొక్కలు నాటి వన మహోత్సవం నిర్వహించారు. జె.ముత్తారెడ్డి, కె.రాజారెడ్డి, ధర్మరాజు, శేషగిరిరావు, అనీష్‌కుమార్ పాల్గొన్నారు. సొసైటీ ఆవరణలో కార్యదర్శి బాలకృష్ణ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

● టి.నర్సాపురం: వెలగపాడు, కేతవరం, బొర్రంపాలెం, వల్లంపట్ల గ్రామాల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు శీలం వెంకటేశ్వరరావు, జయ్యవరపు శ్రీరామ్మూర్తి పాల్గొని మొక్కలు నాటారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో నగరాజ కుమారి, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ సాయిబాబా, అలాగే మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో సొసైటీ సీఈవో కేవీవీ సత్యనారాయణ, సర్పంచ్‌లు నైనారపు జలపాలు, తడికలపూడి శివమాధవి కిశోర్, గండబోయిన శ్రీను, పేరుబోయిన శ్రీనివాసరావు, చవల అప్పలరాజు, శేషు, లింగారెడ్డి శ్రీనివాసరావు, జగన్మోహనరావులు పాల్గొన్నారు.

● కామవరపుకోట : వీరిశెట్టిగూడెంలో ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ పాల్గొని మొక్కలు నాటగా టీడీపీ మండలాధ్యక్షులు ఏలూరి హరిరామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ కోనేరు వెంకట సుబ్బారావు, మాజీ జడ్పీటీసీ ఘంటా సుధీర్‌బాబు, తహసీల్దార్ గెడ్డం ఎలీషా, ఎంపీడీవో ఎం.సరళకుమారి, మండల పరిషత్ ఎఓ ఎస్.ఎన్.బి.సత్యవేణి, ఎంఈఓ డి.సుబ్బారావు, ఏపీవో సి.హెచ్.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.గుంటుపల్లి పంచాయతీలో మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. సర్పంచ్ గోరింక దాసు, ఎంపీటీసీ కంఠమనేని పుష్ప రాజ్యం, టీడీపీ నాయకులు కంఠమనేని అంజిమూర్తి, బేతిన వెంకట్రావు, రేగుంట సురేష్, బాలవర్ధిరాజు పాల్గొన్నారు. కామవరపుకోట పంచాయతీ కార్యాలయం వద్ద, ఎంపీడీవో కార్యాలయం వద్ద, తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సర్పంచ్ కరిపోతు అనూష, టీడీపీ నాయకులు నెక్కలపు గంగాధరరావు, కోటగిరి వేణుబాబు, కె.వెంకట్రామయ్య పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్ : మల్కాపురం, కోటేశ్వరదుర్గాపురం తదితర ప్రాంతాల్లో ఎంపీఈవో వెన్నా శ్రీలత మొక్కలు నాటారు. టీడీపీ నాయకులు నేతల రవి, కొట్టే సుబ్బారావు, పంచాయతీ పాల్గొన్నారు. బ్రహ్మకుమారీస్ ఏలూరుశాఖ, టీమ్ ఆఫ్ గుడ్ గవర్నెన్స్ సంస్థ సంయుక్తంగా శ్రీరామ్ నగర్‌లో మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా రాజు యోగిని బ్రహ్మకుమారీ లావణ్య, టీమ్ ఆఫ్ గుడ్ గవర్నెన్స్ స్థాపకులు శివరామకృష్ణ, జింగిల్ బెల్స్ ప్రిన్సిపల్ విజయలక్ష్మి, శ్రీశ్రీ స్కూల్ అధినేత ఎంబీఎస్ శర్మ పాల్గొన్నారు.

● లింగపాలెం : మండల విస్తరణాధికారి జేఎం రత్నకుమార్, గరిమళ్ల చలపతిరావు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. తహసీల్దార్ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి సువర్ణరాజు, మోరంపూడి మల్లికార్జునరావు, బొంతు రాంబాబు, రాధాకృష్ణ పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే రోషన్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి మొక్కలు నాటారు. చింతలపూడి నియోజకవర్గంలో 25 వేల మొక్కలు నాటడం లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిశోర్, రావూరి కృష్ణ, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్ర శేషు, మండవ లక్ష్మణరావు, పరిమి సత్తిపండు, పెనుమర్తి రామకుమార్ పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి: దర్భగూడెంలో డంపింగ్ యార్డు సమీపంలో, అంకన్నగూడెం, కామయ్యపాలెం, పి.రాజవరం, జీలుగుమిల్లి గ్రామాల్లో మొక్కలు నాటారు. ఎంపీడీవో టి.నిఖిల్ మధు శరణ్, ఏపీవో జాన్‌వెస్లీ, సర్పంచ్ సున్నం ఉషారాణి, ఫారెస్టు అధికారులు ఎఫ్ఎస్‌వో రాంబాబు, ఎఫ్‌బీవో మారేశ్ ఉన్నారు.


భీమడోలులో మొక్కలు నాటుతున్న దృశ్యం

వ్యవసాయ విద్యుత్ సరఫరాలో మార్పులు

పెదవేగి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పెదవేగిలోని 132 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో 31.5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను 50ఎంవీఏ స్థాయికి పెంపుదల చేసే పనులు జరుగుతున్న దృష్ట్యా వ్యవసాయ విద్యుత్ సరఫరాలో మార్పులు చేస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ ఏలూరు ఈఈ కేఎం.అంబేడ్కర్ తెలిపారు. పెదవేగి 132 కేవీ విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో పెదవేగి, కవ్వగుంట, కూచింపూడి, ముండూరు, రామశింగవరం, రాయన్నపాలెం, బాపిరాజుగూడెం, అయ్యపరాజుగూడెం, ధర్మాజీగూడెం, విజయరాయి, జానంపేటల్లోని 33 కేవీ విద్యుత్ ఉపకేంద్రాల్లో వ్యవసాయ ఫీడర్లను రెండు గ్రూపులుగా విభజించి, విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెప్పారు. ఎ-గ్రూపునకు తెల్లవారుజామున 4 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, బి-గ్రూపునకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5గంటల వరకు వ్యవసాయ విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. ఈ నెల 6వ తేదీ నుంచి 26వ తేదీ వరకు విద్యుత్ సరఫరా ఇలాగే ఉంటుందని, రైతులు గమనించాలని ఆయన చెప్పారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

కుక్కునూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జాతీయ నాయకులు కెచ్చల రంగారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం కుక్కునూరులో సీపీఐ(ఎంఎల్) ప్రజాపందా మాస్ లైన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వామినాథన్ కమిషనర్ సిపార్సు మేరకు రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పిస్తేనే న్యాయం జరుగుతుందన్నారు. అలాగే కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని 25గ్రామాల్లోని భూములు ముంపులో లేవన్నారు. వెబ్‌ల్యాండ్ మూసివేయడంతో ప్రభుత్వ రాయితీలు అందక నష్టపోతున్నారన్నారు. రైతాంగానికి సరిపడ విత్తనాలు సబ్సిడీపై ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.కె.గౌస్, జి.ముత్యాలరావు, ఎస్.రామారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

నాణ్యమైన దిగుబడులు సాధించాలి

బుట్టాయగూడెం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటిస్తూ నాణ్యమైన దిగుబడులను సాధించాలని జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ భాష అన్నారు. గురువారం కాపవరం, పండుగూడెం, బండార్లగూడెం గ్రామాల్లో వెంకట్రామన్నగూడెం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహించగా జిల్లా వ్యవసాయాధికారి పాల్గొని మాట్లాడారు. కేంద్రం రైతుల సంక్షేమం కోసం అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. మట్టి నమూనాల సేకరణ, రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు కౌలు కార్డులు, అన్నదాత సుఖీభవ పథకాలను తెలియజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మేరీరాణి, ఈ.రేఖ, ఏ.దేవివర ప్రసాద్ రెడ్డి, ఏడీఏ సలితా సుధా, పిజి బుజ్జిబాబు, డి.ముత్యాలరావు, విజయ్ కుమార్, ఎస్.భవానీ, కె.వజ్రాలరాజు, టి.కిరణ్ కుమార్ రైతులు పాల్గొన్నారు.

మూగజీవాలను వధిస్తే కఠిన చర్యలు

ఏలూరుటూటౌన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మూగజీవులను హింసించినా, వధించినా, అక్రమ రవాణా చేసినా చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పశు సంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ గోవిందరాజు హెచ్చరించారు. ఈ మేరకు గురువారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా గోవిందరాజు మాట్లాడుతూ బక్రీద్ పండుగను పురస్కరించుకుని ఆవులు, దూడలను వధిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.రవాణా శాఖ నుంచి లైసెన్స్ పొందిన వాహనాల్లోనే పశువులు తరలించాలన్నారు. జంతువులను వధిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. పశువులను రోడ్లపై విచ్చలవిడిగా వదిలితే జరిమానా విధిస్తామన్నారు. కార్యక్రమంలో ఏడీ సుబ్రహ్మణ్యం, లక్ష్మీనారాయణ, సుచరిత, వెటర్నరి డాక్టర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలి

జీలుగుమిల్లి, జూన్, 5(ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతు సంఘం నాయకులు చాత్రాతి ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం జీలుగుమిల్లిలో పామాయిల్ రైతులతో సమావేశం నిర్వహించారు. కనీసం టన్నుకు రూ.20 వేలు గిట్టుబాటు ధర ఇవ్వాలని, ఓఈఆర్ సంబంధం లేకుండా రైతుకు నేరుగా డబ్బులు చెల్లించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాణిజ్య పంటలపై మొగ్గు చూపుతూ విదేశీ మారక ద్రవ్యం కోసం ఆయిల్ దిగుమతిపై సుంకాలు తగ్గించి రైతుల్ని కోలుకోలేని దెబ్బ కొడుతున్నారన్నారు. చాత్రాతి భవానీ శేఖర్, కె.ఎల్.ప్రసాద్, పి.జగదీష్, ఉప్పల శంకర్రావు, సత్యనారాయణ ఉన్నారు.

నిర్వాసితులకు ప్యాకేజీతో పాటు ఉద్యోగావకాశాలు

బుట్టాయగూడెం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పోలవరం పర్యటనలో ఇచ్చిన ఆదేశాల మేరకు మంచి పేరున్న 12 కంపెనీలను తీసుకొచ్చి వెయ్యి మంది యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్టు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. గురువారం బుట్టాయగూడెం జడ్పీ హైస్కూల్లో నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ వచ్చిన ఉద్యోగ అవకాశాన్ని అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలను చేరాలన్నారు. ఉద్యోగం వద్దనుకుంటే పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు ముందుకు రావాలని మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. సర్వే నిర్వ హించగా 2 వేల మంది ఉద్యోగాలు, ఉన్నత విద్య, స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా శిక్షణ కావాలని కోరినట్లు తెలిపారు. శిక్షణనిస్తామని, ఉన్నత విద్యకు దరఖాస్తు చేసుకుంటే పరిశీలన తర్వాత ప్రోత్సాహం అందిస్తామన్నారు. ఉద్యోగ మేళాలు అన్ని నియోజకవర్గాల్లో నిర్వహిస్తున్నామని ఇది నిరంతర ప్రక్రియ అన్నారు. యువత ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. కూటమి ప్రభుత్వం హామీలను దశలవారిగా అమలు చేస్తుందని ఎమ్మెల్యే చిర్రి బాల రాజు తెలిపారు. సహాయ సహకారాలు అందిస్తున్న కలెక్టర్‌కు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వన మహోత్సవం సందర్భంగా కలెక్టర్ ఎమ్మెల్యేతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆర్డీవో ఎంవి రమణ, ఐటీడీఏ పీవో కె.రాములు నాయక్, నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఎస్.జితేంద్రబాబు, కె.ప్రవీణ్, సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ పాల్గొన్నారు.

ఎర్రకాల్వ మిగుల భూములు పేదలకు పంచాలి

టి.నర్సాపురం/జంగారెడ్డిగూడెం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఎర్రకాల్వ మిగుల భూములు పేదలకు పంచాలని వ్యవసాయ కార్మిక సంగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి డిమాండ్ చేశారు. టి.నరసాపురం మండలం సాలిగూడెం, జంగారెడ్డిగూడెం మండలం ఎ.పోలవరం, చిన్నవారిగూడెం గ్రామాల పరిధిలోని ఎర్రకాల్వ మిగులు భూముల్లో గురువారం పేదలతో కలిసి దుక్కిదున్ని విత్తనాలు చల్లి వ్యవసాయ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ మిగులు భూముల్లో పేదలు సాగుకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. మండలంలోని బొర్రంపాలెం, మధ్యాహ్నపువారిగూడెం, సాలిగూడెం, తిరుమలదేవిపేట, తదితర గ్రామాల్లో 3,500ఎకరాల వరకు ఎర్రకాల్వ మిగులు భూములు ఉన్నాయన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం, కార్యదర్శి పి.రామకృష్ణ, నాయకులు జి.వెంకట్రావు, మడకం సుధారాణి, కుమారి, మురళీ పాల్గొన్నారు.

ఫర్నిచర్ షాపు దగ్ధం

(5వ పేజీ తరువాయి)

సమీపంలోని దుకాణదారులు మంటలను ఆర్పే ప్రయత్నం చేయగా అప్పటికే ఫర్నిచర్‌కు మంటలు వ్యాపించి దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. కార్మికులు ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. తొలుత ఒక ఫైర్ ఇంజన్ వచ్చి మంటలు అదుపు చేయడానికి ప్రయత్నించగా సాధ్యం కాకపోవడంతో మరో రెండు ఫైర్ ఇంజన్లు తీసుకువచ్చారు. రాత్రి 9.30 గంటల వరకూ మంటలను అదుపు చేస్తూనే ఉన్నారు. జిల్లా అదనపు అగ్నిమాపక శాఖ అధికారి రామకృష్ణ పరిస్థితిని పర్యవేక్షించారు. షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిందా లేదా వెల్డింగ్ పనులతో నిప్పు రవ్వలు ఫర్నిచర్ మెటీరియల్‌పై పడి మంటలు అంటుకున్నాయా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. సుమారు కోటి రూపాయలు పైనే నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా వేస్తున్నారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం మార్గంలో తంగెళ్ళమూడి దాటిన తరువాత జరిగిన అగ్ని ప్రమాదం వల్ల భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ఏలూరు వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ ఆధ్వర్యంలో రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

మైదానం నుంచి మరుభూమి వైపు

(5వ పేజీ తరువాయి)

2004లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం అప్పట్లో నక్సల్స్‌ను చర్చలకు పిలిచింది. జనజీవన స్రవంతిలో కలవాలని విజ్ఞప్తి చేశారు. దీనితో మావోయిస్టు అగ్రనేత ఆర్కేతో పాటు తెంటు సుధాకర్‌తో పాటు ఆయన సతీమణి కాకరా ల సునీత అలియాస్ ఉమా కూడా పాల్గొన్నారు. చర్చల అనంతరం తిరిగి అజ్ఞాతంలోకి వెళ్లిన సుధాకర్ స్వగ్రామం వైపు కన్నెత్తి చూడలేదు. పోలీసుల కంట పడలేదు. తాజాగా జరిగిన ఎన్‌కౌంటర్‌లోనే నిర్జీవంగా కనిపించారు.

కేసులు అనేకం : తెంటు సుధాకర్ అసలు పేరు కాగా పోలీస్ రికార్డుల్లో టీఎల్ఎన్ చలం, ఆనంద్, చంటి బాలకృష్ణ, రామరాజు, ఆర్ఆర్, అరవింద్, సోమన్న అనే పేర్లు కూడా ఉన్నాయి. ఆయనపై వివిధ స్టేషన్లలో అనేక కేసులు ఉన్నాయి. సీలేరు, మక్కువ, ఎల్విన్‌పేట, అన్నవరం తదితర పోలీస్ స్టేషన్లలో కేసులున్నాయి.

ఉత్సాహంగా గోదావరి తీరంలో యోగాంధ్ర

● యోగాసనాలు వేసిన కలెక్టర్, ఎస్పీ

ఏలూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన పట్టిసీమలో ఉత్సాహంగా యోగాంధ్ర కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయం మధ్యలో గోదావరి ప్రశాంత వాతావరణంలో కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎస్పీ కిషోర్, జేసీ పి.ధాత్రిరెడ్డి, పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజులు పాల్గొని యోగాసనాలు వేశారు. వీరితో పాటు సామూహికంగా వెయ్యిమంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రతి ఒక్కరి దైనందిత జీవితంలో యోగా ఒక భాగం కావాలని పేర్కొన్నారు. పోలవరం ఎమ్మెల్యే చిర్రిబాలరాజు మాట్లాడుతూ యోగా వల్ల మానవ శరీరంలోని అన్ని అవయవాలు ఆరోగ్యవంతంగా పనిచేస్తాయన్నారు. జిల్లా ఎస్పీ కిషోర్ మాట్లాడుతూ రోజువారీ దైనందిన జీవితంలో ప్రతీ ఒక్కరూ ఎంతో కొంత మానసిక ఒత్తిడి గురి అవుతున్నారని, దాని నుంచి బయటపడటాని యోగా ఒక సాధనమన్నారు. జేసీ పి.ధాత్రిరెడ్డి మాట్లాడుతూ సచివాలయాలు, వార్డు ప్రజలందరికీ యోగాపై శిక్షణ, అవగాహన కల్పిస్తున్నామన్నారు.

● భీమడోలు: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గ్రామస్థాయి పోటీల్లో గెలుపొందిన వారికి మండల స్థాయిలో 4వ రోజు యోగా సంబంధించి గ్రూప్ యోగాసనాలు, యోగా పాట, యోగా పెయింటింగ్, యోగా స్కిట్, రీల్ అంశాలపై 10-18 సంవత్సరాలు నుంచి 19-35 సంవత్సరాలు, 35 పైబడిన స్త్రీ, పురుషులకు పోటీలు నిర్వహించినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి సిహెచ్ పద్మావతి దేవి తెలిపారు.కార్యక్రమంలో తహసీల్దార్ బి.రమాదేవి, డిప్యూటీ ఎంపీడీవో సుందరి, పీఆర్ఆర్డీ వేణుగోపాల్, పంచాయతీ కార్యదర్శి కెవిఎల్ తనూజ, యోగా మాస్టార్ ఏవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.


యోగా చేస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే చిర్రి

సాయి మందిర్‌లో అన్నదానం

ఏలూరుకార్పొరేషన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి) : ఆదివారపుపేటలోని షిర్డీ సాయి ప్రేమమందిర్‌లో గురువారం భక్తులకు ఆలయ ధర్మకర్త ఇసుకపల్లి తాతారావు ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ సందర్భంగా బాబాకు అభిషేకాలు, అర్చనలు, సాయంత్రం పల్లకీ సేవను నిర్వహించారు.

రెడ్డిగూడెంలో నేడు పల్లెనిద్ర

చింతలపూడి, జూన్ 5(ఆంధ్రజ్యోతి) : నాగిరెడ్డిగూడెంలో పల్లెవెలుగు, స్వర్ణగ్రామం, పల్లెనిద్ర కార్యక్రమం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో శుక్రవారం జరగనుంది. ఈ మేరకు గ్రామ సభను నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. అలాగే రాత్రి పల్లెనిద్ర నిర్వహించనున్నారు.

హామీలను అమలు చేయాలి

బుట్టాయగూడెం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా గురువారం కేవీపీఎస్, డప్పు కళాకారుల సంఘం కలిసి డప్పు కళాకారుల సర్వే చేశారు. రద్దు చేసిన బియ్యం పునరుద్ధరించాలని, స్మశాన వాటికలను ఏర్పాటు చేయాలని, కాలనీల బిల్లులు మంజూరు చేయాలని కళాకారులు కోరినట్లు తెలిపారు. టి.సూరమ్మ, ఎం.నరేష్, టి.గంగా రత్నం, మరియమ్మ, ఏసమ్మ, మేరీ సుగుణమ్మ, పాపమ్మ పాల్గొన్నారు.

కూటమి ఏడాది సంబరాలు

పెదవేగి, జూన్ 5(ఆంధ్రజ్యోతి) : ప్రజలు స్వేచ్ఛాయుత జీవనం సాగిస్తున్నారంటే దానికి కూటమి ప్రభుత్వం కల్పిస్తున్న అండ కారణమని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదకడిమిలో ఏడాది విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఎమ్మెల్యే చింతమనేని పాల్గొని మాట్లాడుతూ ఐదేళ్ల పాటు దుష్టుల పాలనలో బిక్కుబిక్కుమంటూ గడిపిన ప్రజలు కూటమి ప్రభుత్వం రాకతో స్వేచ్ఛ వచ్చి, సుఖ జీవనం గడుపుతున్నారన్నారు. పెదకడిమి సర్పంచ్ కొసరాజు బలరామకృష్ణ చౌదరి, ఎంపీటీసీ సభ్యుడు చల్లగొళ్ల గోపాలకృష్ణ, పార్టీ మండలాధ్యక్ష, కార్యదర్శులు ఈడ్పుగంటి అనిల్, పామర్తి నాగభూషణం, నీటి సంఘం అధ్యక్షుడు ఉండవల్లి వెంకటేశ్వరరావు, కొప్పాక సర్పంచ్ పరాశరం భాస్కర దీక్షితులు, పార్టీ నాయకులు కొసరాజు వరప్రసాద్ పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

● చింతలపూడి : కూటమి పాలన ఏడాది పూర్తయిన సందర్భంగా నాయకులు, కార్యకర్తలు మేడబడి సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద సంబరాలు జరుపుకున్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షులు తాటి అప్పారావు కేక్ కట్ చేసి ఏడాది పాలనపై అభినందనలు తెలిపారు.టీడీపీ నాయకులు సి.హెచ్.ధర్మరాజు, బోడా నాగభూషణం, అట్లూరి శ్రీనివాసరావు, కొత్తపూడి శేషగిరిరావు, రాజాబాబు, నత్తా రవి, గాంధీ, అబ్రహం, జాని, రామారావు పాల్గొన్నారు.

వేసవి సెలవుల్లో తరగతులపై అభ్యంతరం

ఏలూరు అర్బన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి) : వేసవి సెలవుల్లో యథేచ్ఛగా తరగతులు నిర్వహిస్తున్నప్పటికీ తనిఖీలు చేసి నిబంధనలు అతిక్రమించిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్న ఎంఈవోలపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కె.నాని డిమాండ్ చేశారు. గురువారం విద్యానగర్‌లోని ఓ ప్రైవేటు విద్యా సంస్థలో టెన్త్ విద్యార్థులకు ప్రీఫైనల్ నిర్వహిస్తుండటాన్ని గమనించి సంఘ నాయకులు అక్కడకు చేరుకుని విద్యార్థులను పంపించారు.

ఉపాధి హామీ పథకం అమలులో విఫలం

టి.నర్సాపురం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పొందుపరిచిన అంశాలు అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని వ్యవసాయ కార్మిక సంఘం(పీకేఎంయూ) టి.నర్సాపురం మండల కార్యదర్శి తాడిగడప జయరాజు విమర్శించారు. రాజుపోతేపల్లి పంచాయతీలో పని చేస్తున్న ఉపాధి కూలీల సమస్యలు గురువారం అడిగి తెలుసుకున్నారు. ప్రతీ ఉపాధి కార్మికునికి 200రోజులు పనిదినాలు కల్పించి రోజుకు రూ.700 కనీస కూలి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎండలో పని చేస్తున్న కార్మికులకు టెంట్లు ఏర్పాటు చేసి తాగునీరు, మజ్జిగతో పాటు ప్రథమ చికిత్సకిట్‌లు ఏర్పాటు చేయాలన్నారు. జాబ్‌కార్డు కలిగి ఉండి ఉపాధి కల్పించని కూలీలను సంవత్సరానికి రూ.12వేలు ఉపాధి భృతి ఇవ్వాలన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

జంగారెడ్డిగూడెం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఏరియా ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని చింతలపూడి ఎమ్మెల్యే, ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ సొంగా రోషన్ కుమార్ సూచించారు. గురువారం ఏరియా ఆసుపత్రిలో సూపరింటెండెంట్ బేబీ కమల అధ్యక్షతన అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోషన్ కుమార్ మాట్లాడుతూ వైద్యులంతా అందుబాటులో ఉండాలని, ఆసుపత్రి అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు సూపరిండెంటెంట్ డాక్టర్ బేబీ కమల తెలిపారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు కొండ్రెడ్డి కిశోర్,రావూరి కృష్ణ పాల్గొన్నారు.

రెడ్డిఅప్పలనాయుడు అర్జీల స్వీకరణ

ఏలూరు రూరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి) : జనసేన భరోసా కార్యక్రమం కింద నిర్వహిస్తున్న జనవాణీకి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్, ఏలూరు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జీ రెడ్డి అప్పలనాయుడు తెలిపారు. గురువారం 2వ రోజు మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు నుంచి 25కు పైగా సమస్యలపై అర్జీలను ఆయన ఉభయ గోదావరి కోఆర్డినేటర్ కసిరెడ్డి మధులత, పశ్చిమ గోదావరి సంయుక్త కార్యదర్శి ఓబిలిశెట్టి శ్రావణ్ కుమార్ గుప్తాతో కలిసి స్వీకరించారు. స్వీకరించిన అర్జీలను సంబంధిత నియోజకవర్గ అధికారులకు పంపి పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని రెడ్డి అప్పలనాయుడు తెలిపారు.

ధర్మాజీగూడెంలో వాహనాల తనిఖీ

లింగపాలెం, జూన్ 5(ఆంధ్రజ్యోతి):వాహనదారులు తప్పకుండా నిబంధనలు పాటించాలని ధర్మాజీగూడెం ఎస్‌ఐ కె.వెంకన్న అన్నారు. ధర్మాజీగూడెంలో వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు, లైసెన్స్‌లు పరిశీలించారు. ఈసందర్భంగా తనిఖీల్లో సిబ్బంది పాల్గొన్నారు.

మా గ్రామానికి రేషన్‌షాపు కావాలి

కొయ్యలగూడెం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మా గ్రామంలో రేషన్‌షాపు ఏర్పాటు చేయాలని మండలంలోని కిష్టప్పగూడెం ప్రజలు, జనసేన నాయకులు డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మికి వినతిపత్రం ఇచ్చారు. ఈ మేరకు గ్రామస్థులు మాట్లాడుతూ తమ గ్రామంలో రేషన్ షాపు లేకపోవడంతో తామంతా 3కిలోమీటర్ల దూరంలో ఉన్న దిప్పకాయలపాడు వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకోవాల్సి వస్తోందన్నారు. కొయ్యలగూడెం పట్టణ జనసేన అధ్యక్షుడు మాట్లాడుతూ ఈ సమస్యను ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. తోట రామదండు, వెంక టేశ్వరరావు, చినబాబు ఉన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ఏలూరు క్రైం, జూన్ 5(ఆంధ్రజ్యోతి) : అర్ధ రాత్రి ఇంటి నుంచి ఒక యువతి వెళ్లిపోయిం దని ఏలూరు త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు అందడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరు సమీపంలోని గ్రామానికి చెందిన యువతి హైదరాబాద్‌లో ప్రైవేటు జాబ్ చేస్తోంది. ఇటీవల ఇంటికి వచ్చింది. ఈ నెల 4వ తేదీ అర్ధ రాత్రి ఇంటి నుంచి వెళ్లింది. యువతి ఆచూకీ కానరాక పోవడంతో ఆమె తల్లి పద్మావతి ఏలూరు త్రీటౌన్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆరీఫ్

అంజుమన్ అధ్యక్షుడిగా ఆరీఫ్

ఏలూరు రూరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి) : అంజుమన్ సంస్థ నూతన అధ్యక్షుడిగా ఎండీ సిద్ధిక్ ఆలి ఆరీఫ్‌ను నియమించినట్లు ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు ముస్లిం పెద్దలు ప్రకటించారు. గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అస్లాం షరీఫ్ జావేద్ మాట్లాడుతూ సంస్థకు ఇప్పటి వరకు అధ్యక్షుడిగా ఉన్న జబీఉల్లా ముస్లిం సమాజానికి వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపించారు. బక్రీదు పండుగ అనంతరం కార్యవర్గాన్ని విస్తరిస్తామని అధ్యక్షుడిగా ఎన్నికైన ఆరీఫ్ తెలిపారు. ఈ నెల 7న బక్రీద్ పండుగ సందర్భంగా కర్బలా మైదానంలో ఉదయం 8:30 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో మహబూబ్ బాషా, జహీరుద్దీన్, అన్వర్, ఇస్మాయిల్ అక్బర్, ఖాజా పాల్గొన్నారు.

ఉచితంగా మొక్కలు పంపిణీ

ముదినేపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా గురువారం పెయ్యేరులో ముదినేపల్లి డీసీ వైస్ చైర్మన్ హనుమార పేర్నీడు 150 మామిడి, జామ, సపోటా మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. తన తల్లి దండ్రులు హనుమార శివరామకృష్ణం భాను ప్రసాద్, వెంకట బసవ సుభద్ర స్మృత్యర్థం ఈ మొక్కలను పేర్నీడు పంపిణీ చేయగా కాలువ గట్ల వెంబడి, పంచాయతీ ఏరియాలోని ఖాళీ స్థలాల్లో ఇరిగేషన్ డీఈఈ శిరీష, ఏఈ కిషోర్, డీసీ చైర్మన్ మారగాని కొండ, తదితరులు నాటారు.


ముదినేపల్లి ఫీడర్‌లో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ముదినేపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్లకు ఆటంకంగా ఉన్న చెట్లను తొలగించే పనులు నిర్వహిస్తున్నందున శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు ముదినేపల్లి ఫీడర్ పరిధిలోని ముదినేపల్లి, పెయ్యేరు గ్రామాల ఏరియాలో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు గుడివాడ డివిజన్ ఈఈ జిబి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలోని విద్యుత్ వినియోగదార్లు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

చింత తొలగేనా ?

» సుప్రీం కోర్టు ఆదేశాలతో నిలిచిన పనులు
» టీడీపీ ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చినా ముందుకు కదలని పనులు

పనులపై గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం


నూజివీడు నియోజకవర్గంలోని చింతలపూడి కాలువ

నూజివీడు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): చింతలపూడి ఎత్తిపోతల పథకం ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాలలోని మెట్ట ప్రాంతాలను సస్యశ్యామలం చేసే కాలువ. రూ.4,909 కోట్లు వ్యయంతో రెండు ఫేజ్‌లలో ఈ ఎత్తిపోతల పథకం పూర్తి కావాల్సి ఉంది. ఇప్పటికి 50 శాతం పనులు పూర్తయ్యాయి. పర్యావరణ అనుమతులు లేకుండా ఈ చింతలపూడి ఎత్తిపోతల పథకం చేపట్టారని పేర్కొంటూ ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే దివంగత వట్టి వసంత కుమార్ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన ట్రిబ్యునల్ 2022లో రాష్ట్ర ప్రభుత్వానికి రూ.72 కోట్లు జరిమానా విధించింది. దీనిపై అప్పటి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించగా మూడు నెలల్లో జరిమానా చెల్లించడం లేదా పర్యావరణ అనుమతులు పొందాలని ఆదేశించింది. జగన్ ప్రభుత్వం కోర్టు ఉత్తర్వులను అమలు చేయకుండా నిర్లక్ష్యం వహించడంతో సుప్రీంకోర్టు చింతలపూడి పనులను నిలిపివేయాలని ఉత్తర్వులు జారీ చేయడంతో చింతలపూడి పథకం పనులు అప్పటి నుంచి నిలిచిపోయాయి.

ప్రాధాన్యం ఇచ్చినా..!

2024లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రభుత్వం ప్రకటించిన ప్రధాన ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో చింతలపూడి ఎత్తిపోతల పథకం ఒకటి. ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తవుతోంది. ఇప్పటికే ఈ పథకానికి రూ.2,500 కోట్లు వరకు ప్రభుత్వం ఖర్చు చేసింది. సుప్రీం కోర్టు విధించిన రూ.72 కోట్లు అపరాధ రుసుము ప్రభుత్వానికి ఒక లెక్క కాదు. ఈ పథకం ఆలస్యమయ్యే కొద్ది రైతులకు జరిగే నష్టాన్ని పరిశీలిస్తే చెల్లించాల్సిన అపరాధ రుసుము చాలా చిన్నది. రెండు జిల్లాల్లోని సుమారు ఐదు లక్షల ఎకరాలకు సాగునీరు వందలాది గ్రామాలకు తాగునీరును ఈ పథకం ద్వారా గోదావరి జలాలను అందించవచ్చు.

చాట్రాయి మండలంలో వేంపాడు సాగర్ కాలువలోకి ఈ చింతలపూడి కాలువ అనుసంధానం అవుతుంది. వేంపాడు ద్వారానే కింద మండలాలైన ముసునూరు, ఏలూరు జిల్లాలోని వట్లూరు వరకు ఈ గోదావరి జలాలు అందుతాయి. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో చింతలపూడి కాలువ పనులు వేగవంతం కావడంతో చాట్రాయి మండలంలో వేంపాడు సాగర్ కాలువపై కిందకి నీరు వెళ్లడానికి కోసం నిర్మించిన కట్ అండ్ కవర్‌ను తొలగించడంతో ఇప్పుడు సాగర్ నీరు ఈ రెండు మండలాలకు అందని పరిస్థితి.

అడ్డంకులివే.. ఈ పథకానికి గ్రీన్ ట్రిబ్యునల్ విధించిన అపరాధ రుసుముతో పాటు ఫేజ్-1, ఫేజ్-2 లో రైతులకు నష్టపరిహారంగా చెల్లించాల్సింది కలిపి సుమారు రూ.175 కోట్లు ఉంటుంది. ఈ పథకంలో భాగంగా ఉన్న జల్లేరు రిజర్వాయర్ కెపాసిటీని 8 నుంచి 16 టీఎంసీలకు పెంచడంతో కొంత భూభాగం తెలంగాణ రాష్ట్రంలోకి వెళ్లడంతో ఇది రెండు రాష్ట్రాల సమస్యగా మారింది. ఈ రిజర్వాయర్‌లో కొంత భూభాగం అటవీశాఖకు చెంది నది కావడంతో దాన్ని డీనోటిఫై చేయాల్సి ఉంది. ప్రభుత్వం శ్రద్ధ చూపితే వీటిని పరిష్కరించవచ్చని ఆ దిశగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మందగించిన 'తమ్మిలేరు' మరమ్మతులు

కాంట్రాక్టర్‌కు బిల్లులు విడుదల కాకపోవడంతో తమ్మిలేరు ప్రాజెక్టు మరమ్మతు పనులు మందగించాయి. జపాన్ ఇంటర్నేషనల్ కో-ఆపరేషన్ ఏజన్సీ (జైకా) నుంచి అనుమతులు రావాల్సి ఉండగా.. బిల్లులు చెల్లింపులో జాప్యం జరుగుతున్నట్టు తెలిసింది. దీంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. దశాబ్దాలుగా తమ్మిలేరు ప్రాజెక్టుకు మరమ్మతులు లేకపోవడంతో శిథిలావస్థకు చేరిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

» జైకా నుంచి అనుమతులు లేక బిల్లులు విడుదల జాప్యం
» టీడీపీ ప్రభుత్వంలో ఇప్పటికే 50 శాతం పనుల పూర్తి

కాంట్రాక్టర్‌కు రూ.6 కోట్లు బిల్లుల పెండింగ్

చాట్రాయి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో జల వనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కృషితో జపాన్ బ్యాంకు (జైకా) నిధులు రూ.16 కోట్లు మంజూరయ్యాయి. టెండర్లు ప్రక్రియ పూర్తయ్యి కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టే సమయానికి 2019 ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రివర్స్ టెండరింగ్ పేరుతో టెండరును రద్దు చేసింది. 2021లో వైసీపీ సర్కార్ టెండర్లు పిలిచి కాంట్రాక్టర్‌ని ఖరారు చేసినా మూడేళ్లలో ఎడమ కాలువలో కేవలం రూ.1.64 కోట్ల విలువైన పనులే జరిగాయి. బిల్లులు విడుదల చేయకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నూజివీడు ఎమ్మెల్యే, గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారధి ప్రాజెక్టును సందర్శించి పనులు పునఃప్రారంభానికి చర్యలు తీసుకున్నారు. కొన్ని నెలల వ్యవధిలోనే కుడి, ఎడమ, మధ్య కాలువల పనులు సుమారు 50 శాతం జరగడం విశేషం. మే నెల మొదట్లో ఇరిగేషన్ అధికారులు బిల్లులను అప్‌లోడ్ చేశారు. నిధులు లేక బిల్లులు వెనక్కి రావడంతో కాంట్రాక్టర్ పనుల వేగాన్ని తగ్గించారు. కాంట్రాక్టర్‌కి సుమారు రూ.6 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్టు సమాచారం. ప్రభుత్వం బిల్లులు విడుదల చేసి తమ్మిలేరు ప్రాజెక్టు మరమ్మతులు పూర్తి చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.


పోలవరం వద్ద రైట్ కెనాల్‌పై నిర్మించిన స్లూయిజ్ (ఫైల్)

త్వరలోనే బిల్లులు విడుదల

బిల్లుల అప్‌లోడ్ సమయంలో నిధులు లేకపోవడంతో బిల్లులు వెనక్కి వచ్చాయి. ఇప్పుడు ప్రభుత్వం బడ్జెట్ కేటాయించింది. కాంట్రాక్టర్‌కి రావాల్సిన బిల్లులు అప్‌లోడ్ చేస్తున్నాం. త్వరలోనే బిల్లులు విడుదల అవుతాయి. మిగతా పనులు త్వరలో చేపట్టి పూర్తి చేస్తాం.
- సీతారామ్, డీఈ తమ్మిలేరు ప్రాజెక్టు

నూజివీడు 'శ్రీశారద' విద్యార్థినికి ప్రతిభా పురస్కారం


విద్యార్థినికి కళాశాల చైర్మన్ శంకర్ అభినందన

నూజివీడు టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జిల్లాల వారీగా ప్రకటించే ప్రతిభ పురస్కారాలను ప్రభుత్వం ప్రకటించింది. ఏలూరు జిల్లా నుంచి జనరల్ కేటగిరీలో నూజివీడు శ్రీ శారద జూనియర్ కళాశాలకు చెందిన కుప్పాల దేదీప్య సాయి ప్రథమ స్థానంలో నిలిచి, ప్రతిభా పురస్కారానికి ఎంపికైనట్టు కళాశాల చైర్మన్ కె.శంకర్ తెలిపారు. 2025 ఇంటర్ ఫలితాలలో ఈమె 1000 మార్కులకు 991 మార్కులు సాధించిందని, త్వరలో విద్యాశాఖ మంత్రి లోకేశ్ చేతుల మీదుగా ప్రతిభ పురస్కారాన్ని అందుకుంటుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యా సంస్థల చైర్మన్ కె.శంకర్‌రావు, కరస్పాండెంట్ కె.రాధిక, కళాశాల అధ్యాపక బృందం, ప్రజాప్రతినిధులు, సామాజికవేత్తలు ప్రశంసించారు.

ప్రతిభా పురస్కారాలకు నూజివీడు సిద్ధార్థ విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులు

నూజివీడు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతిభా పురస్కారాలకు ఇద్దరు నూజివీడు శ్రీ సిద్ధార్థ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. సీఈసీ నుంచి పూల వెంకన్నబాబు, ఎంఈసీ నుంచి ఎండీ సలాం ఎంపికయ్యారు. వీరిని కళాశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి రవిబాబు, ప్రిన్సిపాల్ జి. శ్రీమన్నారాయణ, డీన్ కె. సురేష్‌బాబు, ఇతర అధ్యాపకులు అభినందించారు.

చాట్రాయి మండల టీడీపీ అధ్యక్షుడిగా ఇజ్జిగాని



చాట్రాయి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): చాట్రాయి మండల టీడీపీ అధ్యక్షుడిగా ఇజ్జిగాని వెంకటేశ్వరరావు(ఆరుగొలనుపేట) ఎన్నికైనట్లు గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి బుధవారం రాత్రి ప్రకటించారు. మండల చరిత్రలో తొలిసారి బీసీ సామాజిక వర్గానికి ఈ పదవి దక్కటం విశేషం. గౌడ కులానికి చెందిన ఇజ్జిగాని వెంకటేశ్వరరావు ఎన్నిక కావటం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతున్నది. 35 ఏళ్ళ నుంచి తెలుగుదేశం క్రియాశీల రాజకీయాల్లో ఉన్న ఇజ్జిగాని వార్డు సభ్యుడిగా, కో-ఆపరేటివ్ డైరెక్టర్‌గా, గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా, మండల బీసీ సెల్ అధ్యక్షుడిగా, సర్పంచ్‌గా అనేక పదవులు నిర్వహించి టీడీపీ బలోపేతానికి అంకితభావంతో పని చేశారు. ఈ సందర్భంగా ఇజ్జిగాని మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో ఈ పదవిని అప్పగించిన మంత్రి పార్థసారథికి, అన్ని గ్రామాల టీడీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

జేఎన్వీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పెదవేగి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయం (జేఎన్వీ)లో 6వ తరగ తిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నా మని పెదవేగి జేఎన్వీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధీర్ కుమార్ చెప్పారు. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆయన తెలిపారు. అభ్యర్థులు 2025- 26 విద్యా సంవత్సరంలో ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తిం పు పొందిన పాఠశాలలో 5వ తరగతి చదువు తూ ఉండాలన్నారు. 2014 మే 1వ తేదీ నుంచి 2016 జూలై 31వ తేదీ మధ్య జన్మించినవారు దరఖాస్తు చేయడానికి అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తు చేయడానికి వచ్చే నెల 29వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. అభ్యర్థులు నవో దయ విద్యాలయ సమితి వెబ్‌సైట్ హెచ్‌టీటీపీఎస్://ఎన్‌ఏవీవోడీఏవైఏ.జీవోవీ.ఐఎన్, హెచ్‌టీ టీపీఎస్://సీబీఎస్‌ఈఐటీఈఎమ్.జీవోవీ.ఐఎన్/ఎన్‌వీఎస్ నుంచి వివరాలు తెలుసుకోవచ్చని, డిసెంబరు 13వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

ముదినేపల్లి పంచాయతీపై కైకలూరు సర్పంచ్ ఫిర్యాదు

సమగ్ర విచారణకు డీపీవో అనూరాధ ఆదేశాలు జారీ

ముదినేపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి పంచాయతీలో గత నాలుగేళ్ళలో జరిగిన ఆర్థిక అవకతవకలు, నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కైకలూరు సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి చేసిన ఫిర్యాదుపై సమగ్ర విచారణ నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి కె. అనూరాధ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 2న ఏలూరులో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో ముదినేపల్లి పంచాయతీలో 2021 ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మే 31 వరకూ జరిగిన ఆర్థిక అవకతవకలు, పంచాయతీ నిధుల దుర్విని యోగంపై విచారణ జరిపించాలని అందుకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు కైకలూరు సర్పంచ్ నవరత్నకుమారి ఫిర్యాదు చేశారని డీపీవో తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదుపై విచారణ నిర్వహించి 15 రోజుల్లోగా సమగ్ర నివేదికను అందజేయాలని గురువారం ఏలూరు డివిజనల్ పంచాయతీ అధికారి, ముదినేపల్లి డిప్యూటీ ఎంపీడీవో (ఈవోపీఆర్డీ)లను ఆదేశించారు. పంచాయతీల్లో అవకతవకలు, నిధులు దుర్వినియోగంపై ఆ పంచాయతీ సభ్యులు గానీ, గ్రామస్థులు గానీ ఫిర్యాదు చేయడం, విచారణ కోరడం ఆనవాయితీ. ముదినేపల్లి పంచాయతీలో అవకతవకలు జరిగాయంటూ కైకలూరు సర్పంచ్ ఫిర్యాదు చేయడం కొత్త ఆనవాయితీకి నాంది పలికినట్లు అయింది.

ఫర్నిచర్ షాపు దగ్ధం

(5వ పేజీ తరువాయి)

సమీపంలోని దుకాణదారులు మంటలను ఆర్పే ప్రయత్నం చేయగా అప్పటికే ఫర్నిచర్‌కు మంటలు వ్యాపించి దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. కార్మికులు ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. తొలుత ఒక ఫైర్ ఇంజన్ వచ్చి మంటలు అదుపు చేయడానికి ప్రయత్నించగా సాధ్యం కాకపోవడంతో మరో రెండు ఫైర్ ఇంజన్లు తీసుకువచ్చారు. రాత్రి 9.30 గంటల వరకూ మంటలను అదుపు చేస్తూనే ఉన్నారు. జిల్లా అదనపు అగ్నిమాపక శాఖ అధికారి రామకృష్ణ పరిస్థితిని పర్యవేక్షించారు. షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిందా లేదా వెల్డింగ్ పనులతో నిప్పు రవ్వలు ఫర్నిచర్ మెటీరియల్‌పై పడి మంటలు అంటుకున్నాయా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. సుమారు కోటి రూపాయలు పైనే నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా వేస్తున్నారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం మార్గంలో తంగెళ్ళమూడి దాటిన తరువాత జరిగిన అగ్ని ప్రమాదం వల్ల భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ఏలూరు వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ ఆధ్వర్యంలో రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

మైదానం నుంచి మరుభూమి వైపు

(5వ పేజీ తరువాయి)

2004లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం అప్పట్లో నక్సల్స్‌ను చర్చలకు పిలిచింది. జనజీవన స్రవంతిలో కలవాలని విజ్ఞప్తి చేశారు. దీంతో మావోయిస్టు అగ్రనేత ఆర్కేతోపాటు తెంటు సుధాకర్‌తో పాటు ఆయన సతీమణి కాకరాల సునీత అలియాస్ ఉమా కూడా పాల్గొన్నారు. చర్చలనంతరం తిరిగి అజ్ఞాతంలోకి వెళ్లిన సుధాకర్ స్వగ్రామం వైపు కన్నెత్తి చూడలేదు. పోలీసుల కంట పడలేదు. తాజాగా జరిగిన ఎన్‌కౌంటర్‌లోనే నిర్జీవంగా కనిపించారు.

కేసులు అనేకం : తెంటు సుధాకర్ అసలు పేరు కాగా పోలీస్ రికా ర్డుల్లో టీఎల్ఎన్ చలం, ఆనంద్, చంటి బాలకృష్ణ, రామరాజు, ఆర్ఆర్, అరవింద్, సోమన్న అనే పేర్లు కూడా ఉన్నాయి. ఆయనపై వివిధ స్టేషన్లలో అనేక కేసులు ఉన్నాయి. సీలేరు, మక్కువ, ఎల్విన్‌పేట, అన్నవరం తదితర పోలీస్ స్టేషన్లలో కేసులున్నాయి.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475

'నెట్టెం'కు మంత్రి సారథి అభినందన



నూజివీడు టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా జిల్లా సహకార కేంద్ర సహకార బ్యాంక్ (కేడీసీసీ) చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన నెట్టెం రఘురాంను రాష్ట్ర గృహనిర్మాణం మరియు సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అభినందించారు. విజయవాడలో రఘురాంను కలిసి మంత్రి ఆయనను సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

బాస్కెట్‌బాల్ విజేతగా ఉమ్మడి కృష్ణా బాలికల జట్టు

నూజివీడు టౌన్, జూన్ 5 (ఆంధ్ర జ్యోతి): ఆంధ్రప్రదేశ్ అండర్-23 బాస్కెట్‌బాల్ 3/3 ప్రథమ ఏపీ ఛాంపియన్‌షిప్ విజేతగా కృష్ణా జిల్లా బాలికల జట్టు నిలిచింది. చిత్తూరులో బుధ, గురువారాల్లో నిర్వహించిన టోర్నమెంట్‌లో ఉమ్మడి కృష్ణ జిల్లా జట్టు లీగ్ దశలో చిత్తూరు జిల్లాపై 14/9, పశ్చిమ గోదావరి జిల్లాపై 5/4, కడప జిల్లాపై 11/1, శ్రీకాకుళం జిల్లాపై 16/5 గెలిచి సెమీఫైనల్స్‌కు చేరింది. సెమీఫైనల్స్‌లో పశ్చిమ గోదావరి జిల్లా జట్టుపై 10/8 స్కోర్‌తో విజయం సాధించింది. ఫైనల్స్‌లో తూర్పు గోదావరి జిల్లా జట్టుపై 14/12 స్కోరుతో విజయం సాధించి మొదటి రాష్ట్ర ఛాంపియన్లుగా నిలిచింది. కృష్ణా జిల్లాకు ప్రాతినిధ్యం వహించిన బాలికల జట్టులో మొత్తం నలుగురు బాలికలు నూజివీడు డీటీహెచ్ గ్రౌండ్‌కు చెందినవారు కావడం విశేషం.


కైకలూరులో ఎమ్మెల్యే కామినేని మొక్క నాటుతున్న దృశ్యం

చెట్లను పూజించే సంప్రదాయం మనది: కామినేని

కైకలూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): భారతీయ సంప్ర దాయంలో చెట్లను, పుట్లను అందరూ పూజించే సంస్కృతి ఉన్నందున పర్యావరణ హితం కోరుతూ ప్రతి ఒక్కరూ చెట్లను పెంచాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని కైకలూరు మండల పరిషత్ కార్యాలయ సముదాయంలో మొక్కలను నాటారు. మాజీ ఎమ్మెల్సీ విఠలరావు, ఎంపీపీ కృష్ణ, తహసీల్దార్ ఇబ్రహీం, ఎండీవో ఫణీంద్ర, డీసీ చైర్మన్ వాసు రాజు పాల్గొన్నారు. కైకలూరు మానవత సేవా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 100 పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. సంస్థ సభ్యులు పాల్గొన్నారు. పర్యావ రణ పరిరక్షణతో ఆరోగ్య వంతమైన సమా జాన్ని నిర్మించుకోగలుగుతామని కైకలూరు జూనియర్ సివిల్ జడ్జి ఎం. శివకిరణ్ అన్నారు. కైకలూరు న్యాయస్థానాల సము దాయంలో ఆయన మొక్కలను నాటారు.

ముసునూరు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీవో బీఏ సత్యనారాయణ, ఏపీవో రోజ్‌లీల అన్నారు. ముసునూరులో ఎంపీడీవో, ఏపీవో, టీడీపీ నాయకులు కొండేటి ఉదయ్‌కిరణ్, తోట శ్రీనివాసరావు, తులిమెల్లి రంగా రావు మొక్కలు నాటారు.

కలిదిండి: కలిదిండి పీహెచ్‌సీ ఆవరణలో అధికారులు, కూటమి నాయకులతో కలసి మొక్కలు నాటారు. ఎంపీడీవో కొండలరావు, పీహెచ్‌సీ వైద్యాధికారులు హేమంత్, జాహ్నవి, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా రత్నారావు, కలిదిండి సర్పంచ్ మారుతి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: నూజివీడు సొసైటీలో ప్రముఖ న్యాయవాది వైఎస్ దొరై గురువారం మొక్కలు నాటారు. సంఘ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి బి.నాగలక్ష్మి, సీఈవో నీలం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: స్థానిక మండల కార్యాలయ ప్రాంగణంలో, శోభనాపురం ఎంపీయూపీ పాఠశాలలో ఎంపీడీవో భార్గవి మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేయించారు. ఆగిరిపల్లి జడ్పీ హైస్కూల్‌లో ఎంఈవో మొక్కలు నాటారు.

చాట్రాయి: పర్యావరణ పరిరక్షణకు అందరూ పాటుపడాలని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి, తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు అన్నారు. చాట్రాయి, చనుబండ, సి. గుడిపాడు గ్రామాల్లో అధికారులు, కూటమి నాయకులు మొక్కలు నాటారు.